AL - HILAL

నెలవంక

మాసపత్రిక

Vol 4,Issue: 15 December - 2007

مجلة الهلال - ملحق مجلة البشرى (باللغة التلغوية)

- హజ్ విధానం
- మహానాడు మహత్తు
- జమీ జమీ జలనిధి

ఈదుల్ అజ్హా శుభాకాంక్షలు!



NELAVANKA
(Al-Hilal)
Monthly

CHIEF PATRON
Muhd. Ismail Al-Ansari

CHIEF EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Shaikh Abdus Salam Omeri
Tahera Begum

Graphic Designer
Noushad Zainulabdeen

PUBLISHED BY
Islam Presentation committee
Kuwait

PHONES
2444116 , 2444117
Extns :
110 Azeezur Rahman
151 Mujahid khan Omeri

FAX
2400057

EMAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com


P.O. Box-1613
Safat-13017, KUWAIT

NELAVANKA










ఈ సంచికలో.... الفهرس

ఏకత్వానికి ప్రతిరూపం	مظاهر الوحدة العالمية 2
IPC ఆధ్వర్యంలో ఈద్ మిలాప్	حفل المهتدين بمناسبة عيد الفطر 3
ప్రవక్త (స) వారి హజ్ విధానం	كيفية حج رسول الله صلى الله عليه وسلم 4
జమ్ జమ్ జలం	فضائل و فوائد زمزم 7
పవిత్ర జీవితం	تلخيص كتاب "الرحيق المختوم" (السفر الى طائف) 8
హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా)	أمهات خالدات "سيدة زينب بنت جحش رضى الله عنها" 9
ఈయనెవరో మీకు తెలుసా?	درس القرآن "سيرة سيدنا ابراهيم عليه السلام" 10
హజీసు మకరందం	درس الحديث 11
అల్లాహ్ ముస్లింల దేవుడా?	درس للمهتدين 12
ఉమ్మత్ ఏకత్వానికి సైద్ధాంతిక మూలాలు	المؤتمر الدولى "الاسس الفكرية لوحدة الأمة" 13
దయలేని వారు దయాదాక్షిణ్యాలకు నోచుకోరు	من لا يرحم لا يُرحم 14
మహోన్నాడు మహత్తు	عظمة يوم عرفة 16
ఓ విశ్వాసి! నీ స్థాయిని తెలుసుకో	إعرف قدرك أيها المسلم (بقلم المهتدى) 17
ఇస్లాం మరియు మహిళలు	الاسلام والمرأة 18

PAGE 1-20.pdf 11/27/07 8:26:57 PM



విలక్షణమైన పత్రిక నెలవంక



– ఒక మేధావి మనోగతం

గడచిన కొన్ని సంవత్సరాలుగా, కువైట్‌లోని ఇస్లామ్ ప్రజంటేషన్ కమిటీ IPC ద్వారా ముద్రించబడుతున్న తెలుగు మాసపత్రిక **"నెలవంక"** (అల్-హిలాల్) సంచికలు కొన్నింటిని చదివే సువర్ణావకాశం లభించినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. ఒక్కో సంచిక 22 పేజీలు కలిగి వున్నది. ఏడెనిమిది మందితో కూడిన సంపాదక వర్గం అంతా తెలుగు మాట్లాడే ఆంధ్రులే, అందరూ తెలుగు భాషలో పాండిత్యం, పత్రికా రచన (Journalism) లో మంచి అనుభవం కలవారిలా కనబడుతున్నారు.

సరళమైన, యింపైన భాషలో ఆకర్షణీయమైన శైలి, చూడచక్కని సందర్భానుసార చిత్రీకరణలతో కూడిన వివరణలు– మొత్తమ్మీద **"నెలవంక"** (మాసపత్రిక) ఆకట్టుకునే విధంగా వుంది. ఇక అందులోని విషయాల లోనికి వస్తే పేరుకులాగే ఇదొక విజ్ఞాన నిధి. దివ్య ఖుర్‌ఆన్‌పై వ్యాసాలు, హదీసులు, ప్రవక్త(సఅస) మరియు ఆయన ప్రియ సహచరుల జీవిత గాధలు మొదలగు వాటన్నింటి సమాహారం ఈ పత్రిక. వీటికితోడు నీతిని బోధించే వ్యాసాలు, క్రొత్తగా ఇస్లాం స్వీకరించిన వారి గాధలు, ధార్మిక పండితులతో ముఖాముఖి, జఠిల సమస్యలపై ధర్మవేత్తల ద్వారా పరిష్కారాలు (ఫత్వాలు), సామాజిక దురాచారాలపై సమరభేరి, అంతిమ (తీర్పు) దినం గురించిన సమాచారం, శాస్త్ర సాంకేతిక రంగాలతో కూడిన విజ్ఞాన భాండాగారాన్ని నెలవంక తన పాఠకులకు అందిస్తున్నది.



An opinion

నాణ్యమైన పేపరు, చక్కటి ముద్రణ, అందమైన కవరు పేజి– ఇవన్నీ కూడ యాజమాన్యపు కళాత్మక అభిరుచిని చెప్పకనే చెబుతున్నాయి. వారు ఎంతైనా అభినందనీయులు. ధార్మిక సేవకులైన యాజమాన్యం మరియు సంపాదక బృందానికి సత్‌ప్రేరణ నొసగి వారి కృషికి ఫలితంగా విజయాలు చేకూర్చాలని అల్లాహ్‌ను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. చిరు **"నెలవంక"** పరిపూర్ణ నిండు పున్నమి వెన్నెల వలె ఎదగాలని ప్రార్థన. (ఆమీన్)

ఎం.డి. సనావుల్లా ఉమ్రీ, ఎం.ఏ,
ఆంగ్ల విభాగం అధిపతి (రిటైర్డ్), హిందూ కళాశాల
మచిలీపట్నం (కృష్ణా జిల్లా, ఎ.పి, ఇండియా)

IPC ఆధ్వర్యంలో

ఈద్ మిలాప్ ఫంక్షన్





గత రమజాన్ మాసంలో ప్రతి రోజూ నవ ముస్లిం సోదరులను ఇఫ్తార్ విందుకు ఆహ్వానించి, వారి ధార్మిక, నైతిక శిక్షణకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేసిన IPC, రమజాన్ పండుగ అనంతరం కువైట్‌లోని కబ్ద్ బ్రాంచ్ ఆఫీసు సమీపంలో 300 మంది ముహ్తదీను (నవ ముస్లిం) లను ఆహ్వానించి అపురూపమైన ఈద్ మిలాప్ ఫంక్షన్ జరుపుకుంది.

IPC సందేశ విభాగం అధికారి **షేఖ్ అబ్దుల్ అజీజ్ షుమ్రీ** సారథ్యంలో జరిగిన ఈ ఉత్సవానికి దావా డిపార్ట్‌మెంట్ మేనేజర్ **అబూ అనస్** ముఖ్య అతిథిగా విచ్చేశారు. IPC తమిళ ప్రీచర్ అబ్దుల్ ముసవ్వీర్ పర్యవేక్షణలో 26-10-2007 వ తేదీ శుక్రవారం- రోజంతా జరిగిన ఈ ఉత్సవంలో భాగంగా నవముస్లింల మధ్య క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ మొదలగు ఆటల పోటీలు కూడా జరుపబడ్డాయి. అనంతరం బహుమతి ప్రదానం చేయబడింది.











PAGE 2-3.pdf 11/27/07 8:29:51 PM

దృక్పథం

بسم الله الرحمن الرحيم



ఏకత్వానికి ప్రతిరూపం

హజ్జ్ మాసంలో అడుగుపెట్టాము. నేల నాలుగు చెరగుల నుంచీ అశేష జనవాహిని హజ్జ్ విధిని నెరవేర్చే సంకల్పంతో తరలివస్తోంది- తమ ప్రభువు ఆజ్ఞాపాలనకు ప్రతిరూపమైన ప్రతిష్ఠాలయానికి, దైవ సింహాసనం ఛాయ ఆవరించివున్న పవిత్ర స్థలానికి, సత్యామృతం జాలువారిన మూల స్థానానికి, ఏకేశ్వరోపాసనకు కేంద్ర బిందువు అయిన ప్రదేశానికి, ఇబ్రాహీం (అలైహి) త్యాగానికి పరాకాష్ఠగా ప్రతీతి చెందిన పుణ్య క్షేత్రానికి, తనయుని కోసం తల్లడిల్లిన మనసుతో మహా తల్లి హాజిరా పరుగులు తీసిన పర్వత శ్రేణులకు, అంతిమ దైవ గ్రంథం అవతరించిన పుణ్యభూమికి, అంతిమ దైవప్రవక్త (సఅసం) పుట్టి పెరిగిన పల్లెల తల్లి (ఉమ్ముల్ ఖురా) మక్కాకు కదలి వస్తోంది.

ఆడంబరాలకు, అట్టహాసాలకు అతి దూరంగా ఆరు ఖండాల నుంచి వచ్చిన భక్తులంతా నిరాడంబరంగా ఒకే చోట, ఒకే విధమైన జీవనశైలికి, ఒకే కార్యక్రమానికి కట్టుబడి 'హజ్జ్' అనే మహా యజ్ఞాన్ని నిర్వర్తిస్తున్నారు. చెదిరిన జుత్తుతో, ఇహ్రామ్ దుస్తుల్లో కటిక కొండల మధ్య కఠోర సాధనకు ఉపక్రమించారు. చూడబోతే వారి జాతులు వేరు, వారి రంగులు రూపు రేఖలు వేరు. వారి దేశాలు వేరు, వేషభాషలు వేరు. అలవాట్లు అభిరుచులు వేరు. వారిలో అరబ్బులతోపాటు అరబ్బేతరులూ ఉన్నారు. ఆర్యులతో పాటు ద్రావిడులు కూడా ఉన్నారు. ప్రాచ్యులే కాదు, పాశ్చాత్యులూ ఉన్నారు. నల్లవారే కాదు, తెల్లవారు కూడా ఉన్నారు. కాని కాబా గృహాన్ని సమీపించిన ఈ విభిన్న జాతుల సముదాయంలో ఎలాంటి భిన్నత్వంగానీ, సంకుచిత భావంగానీ కానరాదు. జాతి విచక్షణ గానీ, వర్ణ వివక్షగానీ అసలే లేదు. భాషాభేదమూ లేదు, భేషజాలూ లేవు. ఇప్పుడు వారందరి లక్ష్యం ఒక్కటే. వారి వేషధారణ కూడా ఒక్కటే- రెండు తెల్లటి దుప్పట్లు! దివి నుండి భువికి దిగివచ్చిన దైవదూతల మాదిరిగా వారు ముందుకు కదలుతున్నారు- ఇప్పుడు వారు మాట్లాడే భాష కూడా ఒక్కటే! వారి అధరాలు ఆలాపించే స్తుతి గీతిక కూడా ఒక్కటే- **"లబ్బైకల్లాహుమ్మ లబ్బైక్. లబ్బైక లా షరీక లక లబ్బైక్. ఇన్నల్ హమ్ద వన్నీ'మత లక వల్‌ముల్క్, లా షరీక లక్."** (హాజరయ్యాను దేవా! నేను హాజరయ్యాను. సాటిలేని ప్రభువా! నేను హాజరయ్యాను. స్తోత్రములు నీకే తగునయా! అనుగ్రహాలన్నీ నీవు వొసగినవేనయా! సార్వభౌమాధికారం కూడా నీకే శోభాయమానమయా! నీకు సాటి ఎవరూ లేరయా!)

అవును. హజ్జ్ ఏకత్వానికి, ఏకాంశానికి ప్రతిరూపం. **'హజ్జ్'** ఓ మహా సమ్మేళనం. అదొక మహా యజ్ఞం. అందులో సంకుచిత భావాలన్నీ సమిధలైపోతాయి. ఆ వాతావరణమంతా మానవ సమానత్వానికి, విశ్వజనీన సౌభ్రాతృత్వానికి అద్దం పడుతుంది. అందరూ ఏక కాలంలో తమ సృష్టికర్త సన్నిధిలో సాష్టాంగ ప్రణామం చేస్తారు. ఒకే సారథిని అనుసరిస్తారు. ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో విడిది చేస్తారు. దుష్టశక్తులపై తిరుగుబాటుకు సంకేతంగా అందరూ నిర్ణీత స్తంభాలపై రాళ్లు రువ్వుతారు.

అందరినీ ఒకే లక్ష్యం వైపుకు ఆకర్షించి, అందరినీ మధురభావాల సుమమాలలో కూర్చిన హజ్జ్ కేవలం లాంఛన ప్రాయమైన మతాచారం కాదు. అది ఏక కాలంలో ప్రపంచ మానవుల కర్తవ్యాన్ని గుర్తు చేసే కీలక విధి! జీవితం అవిభాజ్యమైన ఏకాంకమని నమ్మి నడుచుకునే ప్రజాబాహుళ్యానికి సరైన దిశా నిర్దేశం చేసి ఒకే త్రాటిపై నడిపించే గొప్ప అంతర్జాతీయ సదస్సు!! అజ్ఞాన కాలపు అహంభావాలను అణచివేసి సదాచరణ ప్రాతిపదికపై గౌరవాదరణలను నిర్ధారించే విశ్వజనీన సమ్మేళనం!!!

ఇహ్రామ్ దీక్ష సందర్భంగా నెరవేర్చవచ్చు. ఉదాహరణకు: స్నానం చేయటం, సువాసన పూసుకోవటం మంచిది. హజ్రత్ ఆయిషా(ర.అన్హా) 'మీఖాత్' నుంచి బయలుదేరే సమయంలో కేవలం 'ఉమ్రా' సంకల్పం చేసుకుని ఇహ్రామ్ దీక్ష బూనారు. తీరా ఆమె గారు మక్కాకు చేరుకునే సరికి బహిష్టు అయ్యారు. అందుచేత ఆమెగారు ఉమ్రా చేయలేకపోయారు. అయితే జిల్ హజ్జ్ 8వ తేదీన స్నానం చేసి హజ్ కొరకు ఇహ్రామ్ దీక్ష బూనవలసిందిగా దైవప్రవక్త(స) ఆమెను ఆజ్ఞాపించారు. హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఈ ఆజ్ఞను శిరసావహిస్తూ 'హజ్జె ఖిరాన్' చేశారు. దైవప్రవక్త(స) మరియు ఆయన సహచరులు 'మినా' క్షేత్రానికి వెళ్ళి జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా, ఫజ్ర్ నమాజులు చేశారు. 4 రకాతులు గల నమాజులను 2 రకాతులుగా కుదించి (ఖస్ర్) చేశారు. ఇదే దైవప్రవక్త(స) విధానం. హజ్ యాత్రికులు వీలైనంత అధికంగా 'తల్బియా' పలుకుతూ ఉండాలి. దైవధ్యానం చేస్తూ, దివ్యఖురాన్‌ను పారాయణం చేస్తూ ఉండాలి. మంచిని గురించి ఆజ్ఞాపిస్తూ, చెడుల నుంచి వారిస్తూ, అగత్యపరులకు దానధర్మాలు చేస్తూ ఉండాలి.

అరఫా దినం

జిల్‌హజ్జ్ 9వ తేదీ సూర్యోదయం తరువాత ప్రవక్త(స) తన సహచరుల సమేతంగా తల్బియా, తక్బీర్లు పలుకుతూ అరఫాత్ మైదానం వైపుకు సాగిపోయారు. అరఫాత్ మైదానానికి సమీపంలో 'నిమ్రా' లోయలో కాస్సేపు ఆగి, పొద్దు వాలిన తరువాత అరఫాత్ మైదానంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయన(స) వాహనంపై నుంచే ప్రజలనుద్దేశించి, చరిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. ముస్లిములు పరస్పరం రక్తపాతం సృష్టించటం, ఒకరి ధనాన్ని కాజేయటం, మానమర్యాదలను మంట గలపటం నిషేధించబడినట్లు ఈ శుభసందర్భంగా ఆయన (స) ప్రకటించారు. ముస్లిములు ఖుర్‌ఆన్ హదీసులకు కట్టుబడి ఉన్నంత కాలం పెడత్రోవ పట్టకుండా ఉంటారని వక్కాణించారు. ఈ ఉపదేశాన్ని ముస్లింలు ఖచ్చితంగా పాటించటం అనివార్యం. ఎందుకంటే ఈ హితోపదేశంలోనే వారి శుభశ్రేయాలు, ఇహపర సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. ఆ తరువాత దైవప్రవక్త(స) ఒకే అజాన్‌తో జుహ్ర్, అస్ర్ నమాజులను చేయించారు.





ఇకామత్ మాత్రం రెండు సార్లు చెప్పబడింది. నాలుగేసి రకతులకు బదులు రెండేసి రకతుల చొప్పున (ఖస్ర్) చేసి, జుహ్ర్ సమయంలో ఈ రెండు పూటల నమాజులు చేయించారు. నమాజు ముగించాక ఖిబ్లా వైపునకు తిరిగి దైవధ్యానంలోను, దుఆలోనూ లీనమైపోయారు. సూర్యాస్తమయం వరకూ ఈ ధ్యానం కొనసాగింది. ఆ రోజు ఆయన(స) ఉపవాసం పాటించలేదు. హజ్ యాత్రీకులు ఈ విషయాన్ని ఖచ్చితంగా పాటిస్తూ, అరఫా దినాన ఉపవాస వ్రతం ఉండరాదు. పైగా వారు రెండు చేతుల్ని ఎత్తి సాయంత్రం వరకూ అల్లాహ్ సమక్షంలో ప్రార్థిస్తూ ఉండాలి. ఇతరత్రా విషయాలలో పడి విలువైన సమయాన్ని వృధా చేయకూడదు. కారుణ్య పర్వతం (జబ్లె రహ్మ) వద్దకు పోయి గుమిగూడరాదు. ఇలా చేయటం ప్రవక్త(స) విధానానికి విరుద్ధం. మహనీయ ముహమ్మద్(స) ఈ విధంగా ప్రవచించారు: "అరఫా దినాన అల్లాహ్ అత్యధిక మందికి నరకం నుంచి విముక్తిని ప్రసాదిస్తాడు. ఇంకా ఆనాడు అల్లాహ్ దగ్గరలోకి వచ్చి తన దూతల ముందు తన దాసులను గురించి ప్రస్తావిస్తాడు. వేరొక హదీసు ప్రకారం అల్లాహ్ ఇలా అంటాడు: "నా దాసులను చూడండి! వీళ్లు ఎంతో నిరాడంబర జీవులుగా– చెదరిన జుత్తుతో– నా సన్నిధికి వచ్చి ఉన్నారు. నా కారుణ్యం కొరకు తహతహలాడుతున్నారు. నేను వీళ్లందరినీ క్షమించానన్న విషయానికి మీరు సాక్షులుగా ఉండండి!" **"నేనిక్కడ ఆగి ఉన్నాను. అయితే అరఫాత్ మైదానమంతా ఆగి ఉండవలసిన స్థలమే"** అని మహాప్రవక్త(స) వక్కాణించారు.

ముజ్దలిఫాకు పయనం

సూర్యాస్తమయం కాగానే మహాప్రవక్త(సఅస) తల్బియా పలుకుతూ ముజ్దలిఫా వైపుకు సాగిపోయారు. అక్కడకు చేరుకోగానే ఒకే అజాన్, రెండు ఇఖామత్‌లతో ఆయన(స) మగ్రిబ్, ఇషా నమాజులు చేయించారు. మగ్రిబ్ నమాజ్‌లో మూడు రకాతులు పూర్తిగా చేశారు. ఇషా నమాజులో మాత్రం ఖస్ర్ చేశారు (2 రకాతుల నమాజ్ చేశారు). నమాజ్ అనంతరం అక్కడే నిద్రించారు. ఫజ్ర్ నమాజును సున్నత్ సమేతంగా చేశారు. అనంతరం "మస్ అరే హరామ్" అనే కొండ దగ్గరకు వచ్చి దైవధ్యానంలో, దైవస్తోత్రంలో గాఢంగా లీనమైపోయారు. చేతులెత్తి ప్రార్థించారు. తరువాత ఇలా అన్నారు: **"నేనిక్కడ విడిది చేశాను. అయితే ముజ్దలిఫా అంతా విడిది చేయవలసిన స్థలమే. హజ్ యాత్రీకులు తాము ఆగినచోటే రాత్రి గడపాలి. ఫజ్ర్ నమాజ్ అనంతరం వీలయినంత ఎక్కువగా దుఆ చేయాలి."** కాబట్టి హజ్ యాత్రీకులు దైవప్రవక్త(స) ఆగినచోటే ఆగాలనుకోవటం అవశ్యం కాదు. మహిళలు, చిన్నపిల్లలు రాత్రి చివరి భాగంలోనే 'ముజ్దలిఫా' నుంచి 'మినా' వెళ్ళిపోయేందుకు అనుమతి ఇవ్వబడింది. అలా వెళ్ళిన వారు రాత్రి పూటే పెద్ద జమ్రాపై కంకర రాళ్ళు రువ్వవచ్చు. మహిళల సౌకర్యార్థం ఈ వెసులుబాటు కల్పించబడిందని హజ్రత్ ఉమ్మె సలమా, హజ్రత్ అస్మా బిన్తె అబూబకర్ (ర.అన్హా)ల ద్వారా తెలుస్తోంది.

PAGE 4-5.pdf 11/27/07 8:30:48 PM

మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి

హజ్ విధానం

మూలం: షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మ.అలై) తెలుగు అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ప్రశంసలు, పొగడ్తలన్నీ ఒక్కడైన అల్లాహ్‌కే శోభిస్తాయి. మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై, ఆయన అనుయాయులపై శాంతి శుభాలు వర్షించుగాక!

హజ్ సంకల్పం చేసుకున్న సోదరులారా!

అల్లాహ్ మనందరిపట్ల ప్రసన్నుడవ్వాలనీ, అన్ని రకాల ఉపద్రవాలకు అపమార్గాలకు దూరంగా ఉండే సద్బుద్ధి నొసగాలని ప్రార్థిస్తున్నాను. తనకు నచ్చిన, తాను మెచ్చిన పద్ధతిలో హజ్ చేసే సద్బుద్ధిని ఆయన మనకు ప్రసాదించాలని, మీరు చేసిన హజ్ స్వీకార యోగ్యం కావాలనీ, మీరు మీ దేశాలకు సురక్షితంగా తిరిగి వెళ్ళాలని కూడా ప్రభువైన అల్లాహ్ సన్నిధిలో వేడుకుంటున్నాను. ఉత్తమ ప్రదాత అల్లాహ్ మాత్రమే.

ముస్లిం సోదరులారా!

సర్వకాల సర్వావస్థల్లో అల్లాహ్‌కు భయపడుతూ, ఇస్లాం ధర్మంపై స్థిరంగా, అల్లాహ్‌కు అయిష్టమైన వాటిపట్ల ఎంతో అప్రమత్తంగా ఉండవలసిందిగా మీ అందరినీ అభ్యర్థిస్తున్నాను. నిశ్చయంగా సకల ఆరాధనలలో అల్లాహ్‌ను ఏకేశ్వరునిగా నమ్ముతూ, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకుని, ఆరాధనలను దైవప్రవక్త ముహమ్మద్(సఅ) విధానానికనుగుణంగా నెరవేర్చటం మహత్పూర్వకమైన విషయం. హజ్ చేసినా, మరేయితర ఆరాధనలు చేసినా దేవుడు తన ప్రవక్త(స)కు ఆజ్ఞాపించిన రీతిలోనే చేయాలి. అల్లాహ్‌కు సహపర్తులుగా వేరొకరిని నిలబెట్టడం అన్నిటికన్నా పెద్ద దుర్మార్గం, మహాపరాధం. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను కోరిన వారి కొరకు క్షమిస్తాడు" (సూరె నిసా : 48). అంతేగాక అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (సఅ) నుద్దేశ్యించి ఇలా సెలవిచ్చాడు: **" ఓ ప్రవక్తా! నీ వద్దకూ, నీకు పూర్వం గతించిన ప్రవక్తల వద్దకూ ఇలా వహీ పంపబడింది: 'ఒకవేళ మీరు షిర్కు(బహుదైవారాధన) చేస్తే, మీ కర్మలన్నీ వ్యర్థమైపోతాయి; మీరు నష్టానికి గురి అవుతారు."** (అజ్జుమర్ - 65)

హజ్ యాత్రీకులారా! మన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనాకు ప్రస్థానం చేసిన తరువాత ఒక్కగానొక్కసారి మాత్రమే హజ్ చేశారు. అదే అంతిమ హజ్‌గా ప్రసిద్ధి చెందింది. తన జీవితపు ఆఖరి దశలో ఆయన(స) ఈ హజ్ యాత్ర చేయగా, ఆయన ప్రియ సహచరులు (పెద్ద సంఖ్యలో) ఆయన వెంట వచ్చారు. హజ్ క్రియలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. హజ్ సందర్భంగానే ప్రవక్త (స) వారు తన సహచరులనుద్దేశించి ఇలా ఉద్బోధించారు: **"ప్రజలారా! హజ్ చేసే పద్ధతిని నా నుండి నేర్చుకోండి."** అందుకే ముస్లింలు ఎప్పుడు హజ్ చేసినా, తమ ప్రవక్త(స) పద్ధతిననుసరించి చేయటం తప్పనిసరి. ఎందుకంటే ఆయనే మనందరికీ అతి పెద్ద సంస్కర్త. ఆయన లోకవాసులందరి కోసం కారుణ్యంగా ప్రభవింపజేయబడ్డారు. తన దాసులందరికీ దైవప్రవక్త(స) విధానం ఉదాహరణ ప్రాయమని అల్లాహ్ సెలవిచ్చాడు. ఆయనకు విధేయత కనబరచి, ఆయన అడుగుజాడలలో నడచుకుంటేనే స్వర్గం లభిస్తుందని కూడా దేవుడు ప్రకటించాడు. ఉదాహరణకు దేవుని ఈ ఆదేశాన్ని చూడండి: **"దైవప్రవక్త(స) మీకు ఇచ్చిన దాన్ని పుచ్చుకోండి. ఆయన మిమ్మల్ని వారించిన వాటి జోలికి పోకండి"** (అల్ హష్ర్: 7). మరోచోట ఇలా ఆదేశించబడింది: "నమాజును నెలకొల్పండి. జకాత్‌ను ఇవ్వండి. దైవప్రవక్తను అనుసరిస్తూ ఉండండి. తద్వారా మీరు కరుణించబడతారని ఆశించవచ్చు" (అల్ నూర్ సూరా: 56). వేరొక చోట అల్లాహ్ ఈ విధంగా ఆజ్ఞాపించాడు: "ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు- మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు."

(ఆలి ఇమ్రాన్-31)

జిల్‌హజ్జ ఎనిమిదవ తేదీ

హాజీ సోదరులారా! అంతిమ దైవ ప్రవక్త(స) జిల్‌హజ్జ నెల ఎనిమిదవ తేదీన 'తల్బియా' పఠిస్తూ మక్కా నుండి 'మినా' క్షేత్రానికి బయలుదేరారు. ఎక్కడున్న వారు అక్కడి నుంచే ఇహ్రామ్ దీక్ష బూని- తల్బియా పలుకుతూ- మినా వైపుకు కదలి రావాలని కూడా ఆయన తన ప్రియసహచరులను ఆదేశించారు. అందుకే హజ్ చేయదలచిన వారు - మక్కా వాసులైనా, దూరప్రాంతాల నుంచి వచ్చి, ఉమ్రా చేసి ఇహ్రామ్ దీక్ష నుంచి బయటపడిన వారైనా- జిల్‌హజ్జ్ 8వ తేదీన తాము మకాం చేసిన స్థలం నుంచే ఇహ్రామ్ దీక్ష బూని 'మినా' కు వెళ్ళాలి. ఇదే ప్రవక్త(స) విధానం.

మినాకు వెళ్ళేటప్పుడు తవాఫ్ (కాబా ప్రదక్షిణ) చేయటం సరైన పద్ధతి కాదు. అయితే మీఖాత్ నుంచి వచ్చే సమయంలో ఆచరించిన క్రియలన్నీ




జమ్ జమ్ -
ఆ పేరులోనే ఉంది మహత్యం...!

- శాంతి ప్రియ

హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన జేష్ఠపుత్రుడైన బాల ఇస్మాయీల్‌ను, సతీమణి అయిన హజ్రత్ హాజిరా (అలైహస్సలాం)ను కాబా ఎగువ భాగాన వదలివెళ్ళిన తర్వాత ఉన్న ఆ కాసిన్ని ఖర్జూరాలు, నీళ్ళూ అయిపోయాయి. ఏ ప్రాణీ నివసించని ఆ రాతి నేలలో తీవ్రమయిన దాహంతో నాలుక పీక్కుపోయింది. చివరికి పసికందుని తాపించేందుకు పాలు కూడా లేకుండా ఇంకిపోయాయి. ఏం చేయాలో, ఎలా దాహం తీర్చుకోవాలో, ఏ విధంగా బాలుడ్ని రక్షించుకోవాలో తోచని ఆయోమయ స్థితిలో పడివున్నారు హజ్రత్ హాజిరా (అలైహస్సలాం).

అయినా తాను నిరాశ చెందలేదు. నిస్పృహకు లోనవ్వలేదు. తమ వంతు కృషి ప్రారంభించారు. ఒకసారి సఫా కొండపైకి ఎక్కి చూస్తే, మరోసారి మర్వా కొండపైకెక్కి 'నీళ్ళు లభించే మార్గం దొరక్కపోతుందా!' అని ఎదురు చూపులు చూస్తున్నారు. ఇలా సఫా నుండి మర్వా వరకు, మర్వా నుండి సఫా వరకు ఏడు సార్లు దౌడు తీశారు హజ్రత్ హాజిరా (అలైహస్సలాం). చివరికి మర్వా కొండపై ఉండగా ఏదో అలికిడి...! ఏమైవుంటుందా..!! అని బాల ఇస్మాయీల్ వద్దకు చేరుకున్నారు. పసికందు మండుటెండల్లో భరించలేని ఆకలితో అల్లాడిపోతున్నాడు పాపం! అప్పుడే దైవ దూత ప్రత్యక్షమై తమ రెక్కలతో నేలలో రాజేయగా చుక్క నీరు కూడా లభ్యం కాని ఆ నల్లరాతి నేల నుండి జలనిధి పెల్లుబికింది. హజ్రత్ హాజిరా (అలైహస్సలాం) గారు ముందు బాల ఇస్మాయీల్ దాహాన్ని తీర్చి తర్వాత తానూ దాహం తీర్చుకున్నారు. తన అన్వేషణ ఫలించినందుకు, తన శ్రమకు మించిన వరాన్ని దేవుడు అనుగ్రహించినందుకు దైవానికి మనసారా కృతజ్ఞతాభివందనలు తెలుపుకున్నారు.

ఆ పిదప పారే ఆ జలనిధిని చూసి "ఇది ఇలానే పారుతూ ఉంటే అతి తొందరగా అంతమైపోతుంద"ని భావించి, దాని చుట్టూ మట్టితో గట్టు వేస్తూ ఈ జలనిధిని ఎలాగైనా కాపాడుకోవాలన్న తీవ్ర తపనతో ఆమె నోట అప్రయత్నంగా వెలువడిన అమృత వాక్కు 'జమ్ జమ్' (అంటే అప్పటి భాషలో 'ఆగిపో, ఆగిపో' అని అర్థం). ఆ చిన్నపాటి గట్టులో ఆ మహత్తర జలనిధిని ఆపే శక్తి లేకపోయినా ఆమె నోట అపూర్వ విశ్వాసంతో వెలువడిన పలుకు మహిమతో ఆ జలం జలనిధిగా ఓ చోట నిలిచిపోయింది. అదే జమ్ జమ్ బావిగా ప్రసిద్ధి చెందింది.



ఓ సందర్భాన దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఇస్మాయీల్ తల్లిని కరుణించుగాక! ఆమె గనక ఈ జలనిధికి గట్టువేసి ఆపివుండకపోతే ప్రళయం వరకూ జమ్ జమ్ జలం పారే సెలయేరయ్యేది."

జమ్ జమ్ జల నిధి: జమ్ జమ్ బావి స్వర్గపు సెలయేర్లలోని ఓ సెలయేరు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహి) మక్కా కోసం చేసిన దుఆ తర్వాత దేవుడు అనుగ్రహించి ప్రసాదించిన తొలి బహుమతి ఈ జలం. మక్కా అంతటి పవిత్ర నగరం ఉనికిలోకి రావడానికి, జనవాహినితో, దైవ దాసుల రాకపోకలతో అలరారడానికి కారణమయ్యింది ఈ మహత్తర జలం. కొన్ని వేల సంవత్సరాలుగా లభ్యమవుతున్న దేవుని ఏకైక మహిమ ఈ జలం. ఇహలోకంలో దైవ సూచనల్లోని ఓ సూచన ఈ జలం. ఇక్కడికి వచ్చే ప్రతీ యాచకుడు, ప్రతీ బాటసారి తనివితీరా సేవించే అద్భుత ద్రవం ఈ జలం. ఇంతటి మధురమైన నీరు లోకంలో మరో చోట లేదు. ఈ నీటిలో గొప్ప శుభం ఉంది. అది త్రాగే ప్రతీ వారికి ప్రాప్తమవుతుంది. పరిశుద్ధాత్మ అయిన దైవ దూత జిబ్రయీల్ ద్వారా ఉనికిలోకి వచ్చిన అనంత జల సంపద ఈ జమ్ జమ్. ప్రియ ప్రవక్త(స) వారి హృదయం పలుమార్లు ఈ పవిత్ర జలంతో కడగబడింది. ప్రవక్త ఇబ్రాహీమ్ కాలం నుండి అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వరకు వచ్చిన ప్రవక్తలందరూ త్రాగాలని తహతహలాడిన జలం జమ్ జమ్. ఏ జలానికీ లేని ఈ జలానికి గల ప్రత్యేకత ఏమిటంటే–, ఇది ఆకలిగొన్న వ్యక్తి ఆకలిని తీరుస్తుంది. రోగాన్ని నయం చేస్తుంది. తలనొప్పి, కడుపు నొప్పికి ఇది దివ్య ఔషధం. ఈ జలం వల్ల కంటి చూపు మెరుగవుతుంది. అందుకే ప్రవక్త శ్రీ (స) ఇలా ప్రవచించారు: "మావు జమ్ జమ్ లిమా షురిబ లహు" (ఏ సదుద్దేశంతో జమ్ జమ్ త్రాగుతారో వారి ఆ ఉద్దేశం సిద్ధిస్తుంది.)

ఈ జలాన్ని కడుపు నిండా త్రాగటం విశ్వాసానికి చిహ్నం. కాపట్యానికి విరుగుడు. ఇది పుణ్యాత్ముల కోసం మహోన్నత పానీయం. బంధు మిత్రుల కోసం గొప్ప బహుమానం. అతిథుల ఆతిథ్యం కోసం అద్వితీయ ద్రవ పదార్థం. శరీరానికి శక్తినీ, హాయినీ ఇచ్చే అద్భుత వరప్రసాదం. ఎంత వాడినా అది తరగదు. దాదాపు నాలుగు వేల సంవత్సరాల నుండి ఈ జలం ఇలానే నిర్విరామంగా పెల్లుబుకుతూనే వుంది. ప్రస్తుతం యావత్ప్ర పంచంలో అతి ప్రాచీనమైన బావి ఇదేనన్న నానుడీ ఉంది.

మర్యాదలు: జమ్ జమ్ జలాన్ని సేవించే సున్నత్ విధానం; ఈ జలాన్ని కుడి చేత్తో బిస్మిల్లాహ్ అని త్రాగాలి. ఈ శుభప్రదమైన జలాన్ని నిలబడి త్రాగటం ప్రవక్త (స) వారి సంప్రదాయం. తనివితీరా ఈ జలాన్ని త్రాగాలి. త్రాగే ముందు మంచి సంకల్పం చేసుకొని మరీ త్రాగాలి. త్రాగిన తర్వాత కృతజ్ఞతగా 'అల్ హమ్దులిల్లాహ్' అనాలి. ఈ జలాన్ని మూడు శ్వాసల్లో త్రాగాలి. ఈ జలాన్ని సేవించిన పిదప ఇహపరాల సాఫల్యం, సౌభాగ్యం, శుభం కోసం దుఆ చేయాలి. ఆ సమయంలో చేసే ఏ మంచి దుఆ అయినా స్వీకరించబడుతుంది.


జమ్ జమ్ జలం త్రాగే ఓ సౌభాగ్యవంతుడా!
శుభాకాంక్షలు !!

PAGE 6-7.pdf 11/27/07 8:31:43 PM

పదవ తేదీ పండుగ దినం

ముజ్దలిఫాలో ఫజ్ర్ నమాజు చేసి, తెల్లవారిన తరువాత మహాప్రవక్త(స) తల్బియా పలుకుతూ 'మినా' వైపుకు బయలుదేరారు. అక్కడకు చేరుకోగానే అన్నిటికన్నా ముందు పెద్ద జమ్రాలపై ఏడు కంకరరాళ్లు రువ్వారు. మొదటిసారి రాయి విసిరేటప్పుడు 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్' అని, మిగిలిన ఆరుసార్లు కేవలం అల్లాహు అక్బర్ అని పలికారు. ఆ తరువాత ఖుర్బానీ ఇచ్చి, శిరో ముండనం చేయించుకున్నారు. అప్పుడు హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఆయన (స) కు సువాసన పూసారు. అనంతరం ఆయన మక్కాకు వెళ్ళి తవాఫె జియార (తవాఫె ఇఫాజా) చేశారు. హజ్ క్రియలు వెనుకా ముందు, ముందు వెనుకా కావటం గురించి ఆ రోజు కొంతమంది ప్రశ్నించగా "ఫరవాలేదు, కానివ్వండి" అని ఆయన(స) బదులిచ్చారు. "దైవప్రవక్తా! నేను తవాఫ్‌కు ముందే సయీ చేశాను" అని ఒక వ్యక్తి సందేహపడగా "వచ్చిన నష్టం ఏమీలేదు" అని ఆయన(స) వ్యాఖ్యానించారు.

కాబట్టి హజ్ యాత్రీకులు 10 వ తేదీన దైవప్రవక్త(స) విధానాన్ని అనుసరిస్తూ మొదట పెద్ద జమ్రాపై ఏడుసార్లు కంకర రాళ్లు రువ్వాలి. ఖుర్బానీ ఇవ్వవలసినవారు అక్కడే ఖుర్బానీ ఇచ్చి శిరోముండనం చేయించుకోవటం మంచిది. ఎందుకంటే ఇలా చేసిన వారిని మన్నించమనీ, కరుణించమనీ దైవప్రవక్త(స) మూడుసార్లు ప్రార్థించారు. శిరోముండనం చేయించుకోకుండా జుత్తును కత్తిరించినా ఫరవాలేదు. దీంతో హాజీపై ఉన్న ఇహ్రామ్ ఆంక్షలు తొలగిపోతాయి. అయితే తవాఫ్ (కాబా ప్రదక్షిణ) పూర్తి కానంతరవరకూ అతడు స్త్రీతో సంభోగించలేదు. ఇది తప్ప మిగిలినవన్నీ అతని కొరకు ధర్మసమ్మతం అవుతాయి. ఆ తరువాత హాజీలు మక్కాకు వెళ్ళి తవాఫ్ చేయాలి. 'హజ్జె తమత్తు' సంకల్పం చేసుకున్నవారు 'తవాఫ్'తోపాటు 'సయీ' కూడా చేయాలి. హజ్జె ఖిరాన్, హజ్జె ఇఫ్రాద్ చేసేవారు ముందుగానే సఫా-మర్వాల మధ్య సయీ చేసి ఉంటే ఈ 'సయీ' సరిపోతుంది. ఒకవేళ వారు ముందుగా సయీ చేయకుండా ఉంటే ఇప్పుడు చేసుకోవాలి.



జిల్‌హజ్జ్ 11,12,13 తేదీలు

తవాఫ్, సయీ చేసిన తరువాత దైవప్రవక్త(స) 'మినా' ప్రదేశానికి తిరిగివచ్చారు. 11,12,13 తేదీలలో అక్కడే ఆగారు. మధ్యాహ్నం పొద్దువాలిన పిదప మూడు జమరాత్ (స్తంభాల) పై ఒకేసారి కంకరరాళ్లు రువ్వేవారు. కంకర రాళ్లు రువ్వే ప్రతిసారీ 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. మొదటి రెండు స్తంభాలపై రాళ్లు రువ్విన తరువాత కాబా దిశవైపుకు తిరిగి దుఆ చేశారుగాని మూడవ స్తంభంపై రాళ్లు రువ్విన తరువాత దుఆ చేయలేదు.

13వ తేదీన రాళ్లు రువ్వటం పూర్తవగానే ఆయన(స) మినా నుండి మక్కాకు పయనమయ్యారు. దారిలో 'అవతహ్' అనే లోయలో ఆగి జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా నమాజులు చేశారు. రాత్రి చివరిభాగంలో మక్కాలోకి ప్రవేశించి ఆఖరుసారిగా కాబాగృహ ప్రదక్షిణ చేశారు. అక్కడే ఫజ్ర్ నమాజు చేసి 14వ తేదీ ఉదయం మదీనాకు ప్రయాణమయ్యారు.

కాబట్టి హజ్ యాత్రీకులంతా దైవప్రవక్త(స) విధానాన్ని అనుసరిస్తూ పొద్దువాలిన తరువాత మూడు జమరాత్‌లపై ఏడేసిసార్లు కంకర రాళ్లు రువ్వాలి. రాళ్లు రువ్వేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని అంటూ ఉండాలి. మొదటి రెండు స్తంభాలపై రాళ్లు రువ్వాక దుఆ చేయాలి. ఒకవేళ పగటిపూట కంకర రాళ్లు రువ్వే అవకాశం లభించకపోతే రాత్రి ఫజ్ర్ నమాజ్‌కు ముందు వరకూ రాళ్లు రువ్వవచ్చు.

12 వ తేదీన కంకరరాళ్లు రువ్విన తరువాత తొందరలో ఉన్నవారు సూర్యాస్తమయం కాక ముందే మినా నుండి వెళ్ళవచ్చు. కాని 13వ తేదీ వరకూ అక్కడే ఆగి ఉండటం ఉత్తమం. ఎందుకంటే ఇది దైవప్రవక్త(స) వారి విధానం. అదీగాక 11,12 తేదీలలో రాత్రిపూట 'మినా' లో గడపటం హాజీలకు తప్పనిసరి కూడా. అయితే షరీయతుపరమైన తగు కారణంపై ఎవరయినా వెళ్ళదలిస్తే, ఉదాహరణకు:- హాజీల మంచీ చెబ్బరలు చూసే ఉద్దేశంతోనో, ఖుర్బానీ పశువులను పర్యవేక్షించే ఉద్దేశంతోనో ఎవరయినా అక్కడ రాత్రి పూట ఆగలేకపోతే అది ఆక్షేపణీయం కాదు. అలాగే 13వ తేదీ రాత్రి 'మినా' లో ఏ ఒక్క హాజీ ఆగనవసరంలేదు. సూర్యుడు అస్తమించక ముందే అక్కడి నుంచి వెళ్ళిపోవాలి. ఒకవేళ సూర్యాస్తమయం అయ్యేవరకు బయలుదేరకపోతే మినాలో ఉండిపోవటం అనివార్యం. 13వ తేదీ తరువాత కూడా 'మినా' లో ఉండిపోయిన వారు కంకర రాళ్లు రువ్వటం ధర్మసమ్మతం కాదు.

అంతిమ ప్రదక్షిణ

హజ్ యాత్రీకుడు తన స్వస్థలానికి తిరిగి వెళ్ళాలనుకున్నప్పుడు ఆఖరుసారిగా కాబా గృహప్రదక్షిణ చేయటం అవసరం. ఎందుకంటే, **"ఏ హజ్ యాత్రీకుడు కూడా కడసారి ప్రదక్షిణ చేసేవరకూ తన స్వదేశానికి తిరిగి వెళ్ళరాద"** ని మహా ప్రవక్త(స) ఉపదేశించారు. అయితే రుతుస్రావానికి, పురిట రక్త స్రావానికి గురై ఉన్న మహిళలకు ఇది వర్తించదు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ఉల్లేఖనం దీనికి ఆధారం.

కారుణ్య ప్రభువైన అల్లాహ్ తనకు నచ్చిన, తాను మెచ్చిన పనులు చేసే సద్బుద్ధిని అందరికీ ప్రసాదించాలనీ, మనందరి ప్రార్థనలను స్వీకరించాలని, మనందరినీ నరకాగ్ని నుంచి కాపాడాలని ప్రార్థిస్తున్నాను. అల్లాహ్‌యే అందరికీ స్వామీ, యజమాని . ఆయనే శక్తిశాలి, సర్వాధికారి. మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పై, ఆయన పరివారంపై ఆయన సహచరులపై శాంతి శుభాలు వర్షించుగాక! (ఆమీన్)

విశ్వాసుల మాత



హజ్రత్ జైనబ్ బిన్తె జహాష్ (ర.అన్హా) -2



- అబూ తఫ్హీమ్
ipctelugu@rediffmail.com

ఆ విధంగా హజ్రత్ జైనబ్(ర.అన్హా) తో దైవప్రవక్త(స) వివాహం జరిగిపోయింది. ఆయన(స) జైనబ్ నివాసానికి విచ్చేశారు. వలీమా విందు ఇవ్వబడింది. సుమారు 300 మంది ఈ విందుకు హాజరయ్యారు.

వలీమా అనంతరం పరదా ఆజ్ఞకు సంబంధించిన దైవ వచనం అవతరించింది. ఈ ఆజ్ఞకు దారితీసిన కారణాలలో ఒకటేమంటే వివాహ భోజనానంతరం సహవాసులు అక్కడే బైఠాయించి కాలక్షేపానికి కబుర్లు చెప్పుకోసాగారు. దైవప్రవక్త(స) మాత్రం ఇంట్లోకి వెళ్ళిపోయారు. కాని ఆహూతులు ఎంతకీ అక్కణ్ణుంచి వెళ్ళకపోవటంతో ఆయన(స) అటూ ఇటూ పచార్లు చేయసాగారు. మొహమాటం కొద్దీ వెళ్ళండని తన సహచరులకు చెప్పలేకపోయారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది:

"విశ్వాసులారా! దైవప్రవక్త ఇళ్లల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించకండి. భోజన సమయానికై కాచుకుని కూర్చోకండి. కాని మిమ్మల్ని భోజనానికి పిలిస్తే మాత్రం వెళ్ళండి. అయితే భోజనం చేసిన వెంటనే బయటకి వెళ్ళిపోండి. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఉండిపోకండి. దీనివల్ల ప్రవక్తకు కష్టం కలుగుతుంది. అయినప్పటికీ ఆయన మొగమాట పడతారు. కాని అల్లాహ్ మాత్రం సత్యవిషయం చెప్పటానికి మొహమాటపడదు."

(అల్ అహ్జాబ్ - 53)

ఈ ఆయతు అవతరించిన మీదట ఆయన(స) తలుపు వద్ద తెరను వ్రేలాడదీశారు. ఈ సంఘటన హిజ్రీ 5వ సంవత్సరంలో జరిగింది.

హజ్రత్ జైనబ్ వివాహంలోని ప్రత్యేకతేమంటే దత్తపుత్రుడు కన్నకొడుకు లాంటి వాడన్న అజ్ఞాన కాలపు నమ్మకం రూపుమాపబడింది. పరదా ఆజ్ఞ కూడా అవతరించింది. ఈ వివాహానికి సంబంధించి దివ్యఖుర్ఆన్‌లో ఆజ్ఞ వచ్చింది. ఈ విషయంపై హజ్రత్ జైనబ్(ర.అన్హా) గర్వపడేవారు. "నా వివాహాన్ని అల్లాహ్ ఆకాశాల్లో జరిపించాడ" ని చెప్పుకునేవారు.

హజ్రత్ జైనబ్ సద్గుణ సంపన్నురాలు. చాలా విషయాల్లో ఈమె తన సవతి అయిన ఆయిషా(ర.అన్హా) ను ప్రత్యర్థిగా భావించేవారు. అయినప్పటికీ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పై అపనింద మోపబడినప్పుడు ఈమె నిష్పక్షపాతంగా వ్యవహరించారు. ఆయిషా (ర.అన్హా) గుణశీలముల గురించి ఈమెను అడిగినప్పుడు "నేను ఆయిషా (ర.అన్హా) లో మంచిని తప్ప మరేమీ చూడలేద"ని నిర్ధిష్టంగా తన అభిప్రాయం చెప్పారు.

హజ్రత్ జైనబ్(ర.అన్హా) దానశీలి. నిత్యం పేదల పెన్నిధిగా నిలబడేవారు. **"ఈమె తన వెనుక దీనార్లను గానీ, దిర్హములనుగానీ ఏమీ విడిచిపెట్ట లేదు. తన దగ్గర ఉన్నదంతా దానం చేసేవారు. ఈమె నిరాధారజీవులకు సంరక్షకురాలిగా ఉండేవారు"** అని ఇబ్నెసాద్ లిఖించారు.

ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఈమెకు 12 వేల దిర్హముల పెన్షన్‌ను నిర్ధారించారు. కాని ఈమె దాన్ని కూడా పుచ్చుకోలేదు. ఒకే ఒకసారి మాత్రం పుచ్చుకుని బంధువులకు, అగత్యపరులకు పంచిపెట్టారు. **"ఓ అల్లాహ్! ఇక మీదట ఎన్నడూ ఈ పెద్ద మొత్తం ముట్టకుండా చూడు. ఎందుకంటే ఇది నా పాలిట పరీక్ష కావచ్చు"** అని ప్రార్థించారు.

హజ్రత్ జైనబ్(ర.అన్హా) ధర్మనిష్ఠ గల వనిత. కడు వినమ్రతతో, ఏకాగ్రతతో దైవారాధనలో లీనమయ్యేవారు. ఒకసారి దైవప్రవక్త (స) ముహాజిర్ సహచరులకు ధనం పంచిపెడుతుండగా ఈమె మధ్యలో ఏదో చెప్పబోయారు. "ఈ వ్యవహారంలో మీరు జోక్యం చేసుకోవలసిన అవసరం లేద" ని హజ్రత్ ఉమర్(రజి) కటువుగా చెప్పేసరికి, **"ఉమర్(రజి) ! ఈమెనేమీ అనకు. ఈమె గొప్ప ధర్మపరాయణురాలు"** అని దైవప్రవక్త(స) వక్కాణించారు. ఈమె ధార్మికత గురించి హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఇలా అన్నారు: **"ధార్మిక వ్యవహారాలు, భయభక్తులు, సచ్ఛీలత, ఆప్యాయత, త్యాగం, దాతృ స్వభావం- ఇత్యాది విషయాలలో ఈమెను మించిన మరో వనిత లేదు".** వేరొక సందర్భంలో ఆయిషా(ర.అన్హా) ఇలా అభిప్రాయపడ్డారు: **"నేను ధార్మికంగా ఆమెను మించిన మహిళను చూడలేదు. అల్లాహ్ ఆమెపై దయజూపుగాక! ప్రపంచంలో ఆమెకు అద్వితీయమైన స్థాయి లభించింది. అల్లాహ్ ఆమె వివాహాన్ని తన ప్రవక్తతో- ప్రత్యక్షంగా- జరిపించాడు. ఆమె కారణంగా దివ్యఖుర్ఆన్ ఆయతులు అవతరించాయి."**

హజ్రత్ ఉమర్(రజి) ఖిలాఫత్ కాలంలో - హిజ్రీ 20వ సంవత్సరంలో- ఈమె కాల ధర్మం చెందారు. అప్పటికి ఆమెకు 53 ఏండ్లు. అంతిమ ఘడియల వరకూ ఆమె దానధర్మాలు చేస్తుండేవారు. మరణ సమయంలో ఆమె దగ్గర ఎలాంటి ఆస్తీ లేదు. అంతా దాన ధర్మాలలో ఖర్చయిపోయింది.

అంత్యక్రియల సందర్భంగా ఉపయోగించే (కఫన్) వస్త్రాన్ని తను స్వయంగా సమకూర్చుకుని, ఆ వస్త్రంలోనే తనను చుట్టాలని వసీయతు చేశారు. ఆమె చెప్పినట్లే చేయబడింది. దైవప్రవక్త(స) ను తీసుకెళ్ళిన శవపేటికలోనే తనను మోసుకెళ్ళాలని కూడా తాకీదు చేశారు. ఈ కోరిక కూడా నెరవేర్చబడింది.

ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) ఆమె జనాజా నమాజుకు సారథ్యం వహించారు. జన్నతుల్ బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

ఈమె మరణవార్త విని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తల్లడిల్లిపోయారు. "సాటిలేని మేటి మహిళామణి వెళ్ళిపోయింది. అనాథలను, వితంతువులను వదలి వెళ్ళిపోయింది" అంటూ విలపించారు.

దైవప్రవక్త (స) తన భార్యలనుద్దేశ్యించి, **"మీలో ఎవరి చేతులు పొడవుగా ఉన్నాయో వారే అందరికన్నా ముందు నన్ను చేరుకుంటార"** ని అన్నారు. మహాప్రవక్త(స) పరమ పదించిన తరువాత అందరికన్నా ముందు చనిపోయినది హజ్రత్ జైనబ్(ర.అన్హా) గారే. చేతులు పొడవుగా ఉండటమంటే అర్థం దానధర్మాలు చేయటంలో అందరినీ మించిపోవటం అన్నమాట! ఈ ప్రవచనానికి తాత్పర్యం చెబుతూ హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఇలా అన్నారు: **"మా అందరికన్నా పొడవైన చేతులు గల మహిళ జైనబే. ఎందుకంటే ఆమె తన స్వహస్తాలతో సంపాదించిన దానిని దానం చేసేది."**

(సమాప్తం)

PAGE 8-9.pdf 11/27/07 8:33:07 PM

పవిత్ర జీవితం

మూడవ దశ

మక్కా వెలుపల ఇస్లాం ప్రచారం

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్



సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉఫీ

తాయిఫ్‌లో ప్రవక్త (స) :

నబవీ శకం పదవ సంవత్సరంలో ప్రవక్త (స) తాయిఫు పట్టణానికి బయలుదేరారు. అది మక్కాకు 60 మైళ్ళ దూరాన ఉంది. దైవ ప్రవక్త (స) తన బానిస హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి)ను వెంటబెట్టుకుని తాయిఫ్‌కి కాలినడకన ప్రయాణమయ్యారు. దారిలో తారసపడే ప్రతి తెగవారిని ఇస్లాం వైపు ఆహ్వానించారు. అయితే వారిలో ఏ ఒక్కరు కూడా ఈ ఆహ్వానాన్ని స్వీకరించలేదు. ఆ తర్వాత సరాసరి తాయిఫ్ చేరుకున్న ప్రవక్త (స) అక్కడ పది రోజులు మకాం వేశారు. పుర ప్రముఖులను కలుసుకొని ప్రతి ఒక్కరితో చర్చించారు. దైవ సందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని ప్రాధేయ పడ్డారు.

కాని వారు ప్రవక్త (స) గారితో చాలా దురుసుగా మాట్లాడటమే గాక, ఊరి నుండి బైటకు పొమ్మని విదిలించారు. వారిలోని మూర్ఖులను, తుంటరి పిల్లలను ప్రవక్త (స) పైకి ఉసిగొల్పారు. దైవ ప్రవక్త (స తిరిగి వెళ్ళాలని సంకల్పించినప్పుడు ఈ అల్లరి మూకలు వెంటపడి ఆయన్ను వేధించనారంభించాయి. నోటికొచ్చినట్టు వాగటం, దుర్భాషలాడటం మొదలెట్టారు. ఇది చూసిన మరికొంత మంది కూడా వారికి తోడయ్యారు. ఇప్పుడు రాళ్ళు కూడా రువ్వనారంభించారు. అప్పుడు ఆయనకు కలిగిన గాయాల నుండి కారిన రక్తం ఆయన పాదరక్షల్లో నిండిపోయింది.

ప్రవక్త (స) తాయిఫ్ పట్టణం నుండి బాధగా, నీరసంగా నడుస్తూ మక్కా వైపు వస్తున్నారు. ప్రవక్త (స) ఖర్నుల్ మనాజిల్ (నేడు ఇహ్రాం బూనే సరిహద్దు) చేరుకోగానే, అల్లాహ్ పర్వతాల పర్యవేక్షకుడైన దైవ దూతను జిబ్రయీల్ (అలైహి) కు తోడు చేసి "తాయిఫు పట్టణానికి ఇరువైపుల ఉన్న రెండు పర్వతాలను కలిపివేసి పట్టణాన్ని నుజ్జు నుజ్జు చేసేయండి" అని ఆజ్ఞాపించి మరీ వారిని ప్రవక్త (స)వారి వద్దకు పంపాడు. ప్రవక్త(స) ఆ ప్రదేశంలోనే ఉండగా జిన్నుల (భూతాల) సమూహాన్ని అక్కడికి పంపాడు దేవుడు. వారి గురించి ఖుర్‌ఆన్‌లో రెండు చోట్ల 'అహ్‌ఖాఫ్' మరియు 'జిన్' అధ్యాయాల్లో ప్రస్తావించాడు కూడా. (ప్రవక్త (స) మధురమైన స్వరంతో ఖుర్‌ఆన్ పఠిస్తూ ఉండగా) జిన్నుల సమూహం ఒకటి అటుగా పోవడం జరిగింది. ఖుర్‌ఆన్ పఠనం చెవిన పడింది. దాంతో వారు ఠక్కున ఆగి (ఆ దివ్య వాణిని) శ్రద్ధగా ఆలకించారు. ప్రవక్త (స) గారి పఠనం పూర్తయ్యాక, అక్కణ్ణుంచి వెళ్ళి తమ జాతివారిని ఇలా హెచ్చరించారు: "ప్రవక్త మూసా (అలైహి) తర్వాత గత గ్రంథాలను ధృవపరిచే, సన్మార్గం చూపించే గ్రంథాన్ని మేము విన్నాము."



ఈ విషయాన్నే అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు: **"మేము జిన్నుల సమూహం నొకదాన్ని ఖుర్‌ఆన్ వినేందుకు నీ దగ్గరకు పంపాము. వారు (నీవు ఖుర్‌ఆన్ పఠిస్తున్న) ఆ స్థలానికి చేరుకొని నిశ్శబ్దంగా ఉండండని పరస్పరం చెప్పుకున్నారు.ఖుర్‌ఆన్ పఠనం ముగిసిన తర్వాత వారు భయభోధకులుగా తమ జాతివారి వద్దకు వెళ్ళారు. వారు– అక్కడకు వెళ్ళి ఇలా అన్నారు: "ఓ మా జాతి ప్రజలారా! మేము ఒక గ్రంథాన్ని విన్నాము. అది మూసా (అలైహి) తర్వాత అవతరించింది. తనకు పూర్వం అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తుంది. సత్యం వైపునకు, రుజు మార్గం వైపునకు దారి చూపిస్తుంది."**

(దివ్య ఖుర్‌ఆన్– 46: 29,30)


వివిధ వర్గాల్లో, వ్యక్తుల్లో ఇస్లాం ప్రచారం:

నబవీ 11వ సంవత్సరంలో ప్రవక్త (స) మక్కాకు తిరిగి వచ్చారు. హజ్జ్ కాలం సమీపించింది కనుక హజ్జ్ కాలంలో దేశం నలువైపుల నుంచి వచ్చే విభిన్న తెగలవారికి ఇస్లాం పరిచయం చెయ్యాలి. ఈ కృషి ఫలితంగా ఆ వచ్చిన తెగల్లోని మదీనాకు చెందిన ఆరుగురు ఇస్లాం స్వీకరించారు. బనూ ఆమిర్, బనూ కల్బ్, బనూ హనీఫా తెగవారు మాత్రం ఈ సందేశాన్ని అంగీకరించలేదు. ఆ సందర్భంలో ప్రవక్త (స) ప్రత్యేకంగా కొందరు ప్రముఖులను కూడా కలుసుకున్నారు. వారిలో 'సువైద్ బిన్ సామిత్' ఒకరు. ఆయన తన ఇస్లాంను బాహాటంగా ప్రకటించారు. అలాగే అబూజర్ గిఫారీ, మరియు తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ కూడా ప్రవక్త (స) గారి పిలుపుపై ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారితో ప్రవక్త (స) వారి వివాహం:

నబవీ 11వ సంవత్సరం షవ్వాల్ మాసంలో ఆరేండ్ల వయసు గల హజ్రత్ ఆయిషా (ర. అన్హా) గారిని ప్రవక్త (స) వివాహమాడారు. హిజ్రీ శకం మొదటి సంవత్సరం షవ్వాల్ మాసంలో హజ్రత్ ఆయిషా (ర. అన్హా) దైవ ప్రవక్త (స) తో కాపురానికి వెళ్ళారు. అప్పుడామెకు తొమ్మిదేళ్ళు.

(ఇంకా ఉంది)



గౌరవోన్నతులకు ప్రాతిపదిక

మూలం :
హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మా.లై)

అనువాదం
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

(1) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: "దానధర్మాలు ఏ సంపదలోనూ ఎలాంటి లోటునూ కలిగించవు. మన్నింపుల వైఖరిని అవలంబించే దాసుని గౌరవ ప్రతిష్ఠలను పెంచటమే అల్లాహ్ అభిమతం. కేవలం దైవప్రసన్నతను బడయటం తప్ప మరో ఉద్దేశం లేకుండా వెనక్కి తగ్గే వ్యక్తికి అల్లాహ్ ఉన్నతిని ప్రసాదిస్తాడు." (ముస్లిం)

సారాంశం

మనిషిని నైతికంగా ఉన్నత శిఖరాలకు చేర్చే మూడు విషయాలు ఈ హదీసులో ప్రస్తావించబడ్డాయి. ఇవి మూడు సద్గుణాలకు సరోవరం వంటివి. (1) దానధర్మాలు (2) మన్నింపు (3) అణకువ. ఈ మూడు గుణాలు కలిగివున్న వ్యక్తి త్వరితగతిన దైవప్రసన్నతను చూరగొంటాడు. దైవదాసులు కూడా అతన్ని అమితంగా ప్రేమించసాగుతారు. గౌరవ ప్రతిష్ఠలు పెరగటమంటే భావం ఇదే. తనను అతి సామాన్యునిగా ఊహించుకుంటూ, తోటివారిని తనకన్నా ఉత్తములని తలపోస్తూ, ఒకరి కోసం ఓ మెట్టు దిగివచ్చే, ఒకరి కోసం తన కుర్చీని ఖాళీ చేసే, ఒకరి కోసం తాను వెనుక సీట్లో కూర్చోవటానికే ఇష్టపడే వ్యక్తి పట్ల అందరిలోనూ 'స్వీకృత' భావం పెంపొందుతుంది. అటువంటి త్యాగధనునికి శత్రువులు కూడా ఉండరు. దైవప్రసన్నతను బడయటమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నందువల్ల దేవుడు అతని గౌరవోన్నతుల్ని పెంచుతాడు.

(2) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు: "మీరు ధన సంపత్తుల ద్వారా ప్రజలను సంతోషపెట్టలేరు. అందుకే మీరు సత్ప్రవర్తన, మృదుత్వం ద్వారా ప్రజల్లో సంతోషాన్నీ, తృప్తినీ పెంపొందించే యత్నం చేయండి."
(ఈ హదీసును అబూ యాలా ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

సారాంశం

మనిషి కోర్కెలు అపరిమితమైనవి. వనరులు మాత్రం పరిమితమైనవి. అందుచేత ధనసంపత్తుల ద్వారా, డబ్బు ద్వారా, చిరు మందహాసం ద్వారా, మృదుత్వం, మనింపుల స్వభావం ద్వారా ప్రజలను సంతోషపెట్టాలి. ముఖ్యంగా ప్రజా సముదాయాలకు నాయకులుగా, సంస్కర్తలుగా, మార్గదర్శకులుగా, పీఠాధిపతులుగా చెలామణీ అయ్యేవారు ఈ విషయాన్ని అనునిత్యం దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుకంటే వాక్చాతుర్యంతో, అందమైన ప్రసంగాలతో జనసామాన్యాన్ని, కార్యకర్తల్ని సమీకరించటం, సంస్థల్ని సంఘాలను నెలకొల్పటం సులభమే. కాని ఆ కార్యకర్తల్ని అయస్కాంతంలా ఆకర్షించి, వారు ఎప్పటికీ దూరం కాకుండా ఉండేలా ఆపి ఉంచటం చాలా కష్టం. ఆశయం పట్ల నిబద్ధత, లక్ష్యం పట్ల అచంచలమైన విశ్వాసంతో పాటు, దానికోసం పాటుపడే వారికి ప్రేమానురాగాలను పంచిపెట్టినప్పుడే వారు ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు దూసుకు పోగలుగుతారు.

(3) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఒక విశ్వాసి మరో విశ్వాస సోదరునికి అద్దం లాంటివాడు."

సారాంశం

అద్దం ఎంతో నిజాయితీ గలది. అది ఏ విషయంలోనూ హెచ్చుతగ్గులు చేయదు. ఉన్నదున్నట్లుగా చూపెడుతుంది. అద్దం మాట్లాడదు. అది ఉపన్యాసాలివ్వదు. అది నిశ్శబ్దంగా ఉంటూనే తనను చూచే వారికి హితబోధ చేస్తుంది. అద్దం చూసుకున్న మనిషి తన మొహంపై ఉన్న లోపాలను తిలకిస్తాడు. అద్దం వీపు వెనుక చాడీలు చెప్పటంగానీ, పరోక్ష నింద చేయటంగానీ చేయదు. ఏం చెప్పాలనుకున్నా మొహం మీదే చెబుతుంది.

అలాగే ఒక విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటివాడు. అతన్ని చూచి అతన్నుండి నేర్చుకోవలసిన మంచి విషయాలేవయినా ఉంటే నేర్చుకుంటాడు. తనలోని లోపాలను సరిదిద్దుకుంటాడు. అలాగే తన ముందున్న సోదరునిలో ఏవైనా లోపాలుంటే, అతని పరోక్షంలో వాటిని ప్రస్తావించే బదులు అతని ఎదుటే హెచ్చుతగ్గులు లేకుండా, నిర్మొహమాటంగా చెప్పాలి. అలా చెబితే ఎదుటివాడు ఏమనుకుంటాడో ఏమో అని సందేహపడనవసరం లేదు. కాకపోతే అందరి ముందూ అతన్ని అవమానపరచకుండా ఏకాంతంలో నచ్చచెప్పవచ్చు. ఈ 'సంస్కరణ' కోసం వారిద్దరి మధ్య కించిత్ ఉద్రిక్తత ఏర్పడినా ఫరవాలేదు. వీపు వెనుక చాడీలు చెప్పటం కన్నా ఇది ఎన్నో రెట్లు మెరుగు. ఎందుకంటే ; అద్దాన్నే ఉపమానంగా తీసుకోండి– అది క్రిందపడి ముక్కలైనాసరే రూపురేఖలను ప్రతిబింబించే దాని నైజంలో మాత్రం మార్పుండదు. అలాగే మనం ఒకరి శ్రేయాన్ని అభిలషిస్తున్నప్పుడు, వారు మన గురించి ఏమనుకుంటున్నారో ఏమోనని మనం మీనమేషాలు లెక్కించుకుంటూ, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ఇక సంస్కరణ జరిగేదెలా?! మన పనైతే అద్దం మాదిరిగా ఉన్నదున్నట్లుగా నిష్కర్షగా, నిర్దిష్టంగా– చెప్పేయటమే.



PAGE 10-11.pdf 11/27/07 8:34:15 PM

ఖుర్‌ఆన్ పాఠం



ఈయన ఎవరో మీకు తెలుసా?



-అబ్దుల్ ఖాదర్ ఉమ్రి

విశ్వప్రభువైన అల్లాహ్ సెలవిస్తున్నాడు:-

"నిశ్చయంగా **ఇబ్రాహీం** (తనకు తానే) ఒక సంఘం. అల్లాహ్‌కు పరమ విధేయుడు. (అల్లాహ్ యందే) మనస్సు నిలిపినవాడు. ఆయన (అల్లాహ్‌కు) సాటి కల్పించే వారిలోనివాడు కాదు. అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలిపేవాడు. అల్లాహ్ ఆయన్ను (తన కార్యం కొరకు) ఎన్నుకున్నాడు. ఆయనకు రుజుమార్గాన్ని చూపాడు. ప్రపంచంలో ఆయనకు మేలును అనుగ్రహించాడు. నిశ్చయంగా పరలోకంలోనూ ఆయన సజ్జనులలో ఒకరుగా ఉంటారు. తరువాత మేము నీ వద్దకు వహీ (దివ్య వాణి) ని పంపాము: 'ఏకాగ్ర చిత్తుడవై **ఇబ్రాహీం** విధానాన్ని అనుసరించు, ఆయన బహుదైవారాధకులలోని వాడు కాదు' అని. (16: 120-123)

సోదర సోదరీమణులారా!

దైవ ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రవక్తల పితామహులు. ఆయన వ్యక్తిత్వం పరిపూర్ణ దైవ విధేయతకు ప్రతిరూపం. ఆయన జీవితం దైవప్రేమకు, దైవ దాస్యానికి ప్రతీక. విశ్వప్రభువు అల్లాహ్ ఘనతా, ఔన్నత్యాలను లోకానికి చాటి చెప్పడానికి ఆయన చేసిన త్యాగాలు అగణ్యమైనవి. రండి – ఈ మహా మనీషి జీవితంలోని కొన్ని కోణాలను సంక్షిప్తంగా అవలోకన చేసుకుందాం.

దైవ ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) విగ్రహారాధకుల కుటుంబంలో జన్మిస్తారు. తండ్రి –ఆజర్– ఒక పెద్ద పురోహితుడు. విగ్రహాల వ్యాపారి. **ఇబ్రాహీం** పసితనం నుంచే తండ్రిని నిశిత దృష్టితో గమనిస్తారు. ప్రజలు తండ్రిని అమితంగా గౌరవిస్తున్నారు. అతనికి కానుకలు చెల్లించుకుంటున్నారు. తండ్రి కష్ట పడకుండానే డబ్బు వస్తూ ఉంది. చీకూచింతా లేకుండా జీవితం హాయిగా గడచిపోతూ ఉంది. దేవుని పేరుతో తండ్రి చేసే మత వ్యాపారాన్ని, ప్రజలను మోసగించి సంపాదిస్తున్న అక్రమ సంపాదనను **ఇబ్రాహీం (అలైహిస్సలాం)** అసహ్యించుకుంటారు. విగ్రహారాధనకు, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తారు. తండ్రిని ఇలా నిలదీస్తారు: **"నాన్నా ! వినలేని, కనలేని, మీ ఏ పనినీ చేసి పెట్టలేని విగ్రహాలను మీరు ఎందుకు ఆరాధిస్తున్నారు? నాన్నా! సత్యాసత్యాలకు సంబంధించిన జ్ఞానం నాకు లభించింది. మీరు నా మాట వినండి. విగ్రహారాధనను మానుకోండి. షైతాన్‌ను ఆరాధించకండి."**

ఈ సత్యసందేశాన్ని విన్న తండ్రి రెచ్చిపోతాడు. **" ఒరే ఇబ్రాహీం! నా దేవిదేవతలకు వ్యతిరేకంగా ఇంకొక్కమాట మాట్లాడావంటే.. నేను నిన్ను రాళ్ళతో చావగొడ్తాను. పో...శాశ్వతంగా నా నుండి వేరయిపో"** అని అంటాడు.

దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) "నాన్నా! మీకు నా సలాం. నేను ఈ ఇంటిని వదిలేసి వెళ్ళిపోతున్నాను" అని చెప్పి ఇంటి నుంచి వెళ్ళిపోతారు. ఈ విధంగా ఇబ్రాహీం(అలైహి) మిథ్యా గౌరవాదరణాలను, అక్రమసంపాదనను తృణీకరిస్తారు.

దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన జాతిని కూడా ఏకదైవారాధన వైపుకు పిలుపు ఇవ్వాలని, అల్లాహ్ ఘనత ఔన్నత్యాలను గురించి చాటి చెప్పాలని నిర్ణయించుకుంటారు. ఎంతో ఆత్మ స్థయిర్యంతో తన జాతి వారితో ఇలా అంటారు:

"మీరు విశ్వప్రభువైన అల్లాహ్‌ను కాదని మీకు ఎలాంటి లాభంకానీ, నష్టంకానీ కలిగించలేని విగ్రహాలను మీరు పూజిస్తున్నారే! అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయనకే భయపడండి. నిజానికి మీకు ఉపాధినిచ్చే శక్తి, అధికారం మీరు పూజిస్తున్న విగ్రహాలకు ఏ మాత్రం లేవు. ఉపాధి కోసం అల్లాహ్‌నే అర్థించండి. ఆయనకే కృతజ్ఞతలు తెలుపుకోండి. మరణానంతరం ఆయన వైపునకే మీరు మరలిపోవలసి ఉంది." అని స్పష్టంగా ప్రకటిస్తారు. అంతేకాదు, విగ్రహారాధన వాస్తవికతను జాతి ప్రజలకు చూపించాలన్న ఉద్దేశ్యంతో ఒక రోజు అవకాశం చూసుకొని దేవాలయంలో ప్రవేశించి విగ్రహాలన్నింటిని తునాతునకలుగా పగలగొడ్తారు. జాతి ప్రజలు తమ దేవతలకు పట్టిన ఈ దుర్గతిని చూస్తారు. తమ అంతరాత్మల వైపు దృష్టి మళ్ళిస్తారు. అల్లాహ్‌ను వదలి ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని వాటిని పూజిస్తూ తాము దుర్మార్గానికి ఒడిగట్టామని తమ మనస్సులోనే అనుకుంటారు. ఆయినా అంధ విశ్వాసాలను అంత సులభంగా వారు ఎలా వదలుకుంటారు? భోగలాలసపరులు, అసత్యగౌరవ ప్రతిష్ఠల కోసం ప్రాకులాడేవారు ఎలా ఊరుకుంటారు? వారు రెచ్చిపోతారు. **"మన దేవుళ్ళను ముక్కలు ముక్కలుగా చేసిన వాణ్ణి కఠినంగా శిక్షించనంతవరకు మన దేవతల మెప్పును పొందలేము"** అంటారు. **ఇబ్రాహీం (అలైహిస్సలాం)** ను పట్టుకొని ఆనాటి చక్రవర్తి –నమ్రూద్– దర్బారులో హాజరుపరుస్తారు.

నమ్రూద్ విశ్వప్రభువు అయిన అల్లాహ్ ఘనత ఔన్నత్యాల ముందు తలవంచడానికి నిరాకరించిన చక్రవర్తి. తన సామ్రాజ్యం, అధికారం చూసుకొని విర్రవీగుతూ ప్రజల జీవన్మరణాలు, లాభనష్టాలు, గౌరవ అగౌరవాలు అన్నీ తన చేతిలోనే ఉన్నాయని అతను భావిస్తుంటాడు.

నమ్రూద్ అధికార మదంతో **"ఎవరు నీ ప్రభువు"** అని ప్రశ్నిస్తాడు. **"జీవన్మరణాలు ఎవరి అధీనంలో ఉన్నాయో ఆయనే నా ప్రభువు"** అని **ఇబ్రాహీం (అలైహిస్సలాం)** నిర్భయంగా జవాబిస్తారు. **"నా చేతిలో కూడా జీవన్మరణాలున్నాయి. నేను తలచుకున్న వారికి మరణ శిక్ష విధించగలను. నేను కోరుకున్న వారిని సజీవంగా ఉంచగలను"** అని అంటాడు తలబిరుసు చక్రవర్తి. దానిపై **ఇబ్రాహీం (అలైహిస్సలాం)** అంటారు: **"సరే, అలాగైతే అల్లాహ్ సూర్యుడ్ని తూర్పు నుంచి ఉదయింపజేస్తున్నాడు, నువ్వు కాస్త దాన్ని పడమర నుంచి ఉదయింపజెయ్యి"** అని. **ఇబ్రాహీం (అలైహిస్సలాం)** అన్న ఈ మాటకు నమ్రూద్ నిర్ఘాంతపోతాడు. **ఇబ్రాహీం (అలైహిస్సలాం)**ను అంతమొందించకపోతే తన అధికార పీఠానికే ముప్పు తప్పదని భావిస్తాడు. దమన నీతిని అవలంబిస్తాడు. **"కాల్చి వేయండి ఇబ్రాహీంని, మీ దేవుళ్ళకు అండగా ఉండండి"** అని అరుస్తాడు.

(ఇంకా వుంది)

జమీయతుల్ ఇస్లాహ్ ఆధ్వర్యంలో సదస్సు

ఉమ్మత్ ఏకత్వానికి సైద్ధాంతిక మూలాలు

కువైట్‌లోని సుప్రసిద్ధ ఇస్లామీయ ఉద్యమ సంస్థ "జమీయతుల్ ఇస్లాహ్ అల్ ఇజ్తెమాయి" ఆధ్వర్యంలో 2007 నవంబరు 13,14 తేదీలలో స్థానిక హాలిడే ఇన్ హోటల్లో అంతర్జాతీయ ధార్మిక సదస్సు ఒకటి ఏర్పాటు చేయబడింది.

"ఉమ్మత్ ఏకత్వానికి సైద్ధాంతిక మూలాలు" అన్న ప్రధానాంశం ఆధారంగా జరిగిన ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ఇస్లామీయ ఉద్యమ నాయకులు, మేధావులు, పండితులు పాల్గొన్నారు.

కువైట్ పార్లమెంట్ సభ్యులు అష్షేఖ్ నాసిర్ అహ్మద్ అల్ సబాహ్ సదస్సును ప్రారంభిస్తూ దైవగ్రంథం, దైవప్రవక్త (స) సంప్రదాయం ప్రాతిపదికగా సంస్కరణోద్యమాలను నడిపి, ప్రజా బాహుళ్యానికి నిర్మాణాత్మక విచారధారను ఇచ్చిన సత్యధర్మ వైతాళికులు సదా చిరస్మరణీయులుగా ఉంటారని వక్కాణించారు. కారుణ్య ప్రభువు అయిన అల్లాహ్ ఒక్కో యుగంలో ఒక్కో యుగపురుషుణ్ణి, మహా సంస్కర్తను ఉద్భవింపజేసి వారి ద్వారా సమకాలీన సవాళ్ళను ఎదుర్కొనే స్ఫూర్తిని ఉమ్మత్‌కు అందిస్తూ వచ్చాడని, వివిధ దేశాలలో ఆ సత్పురుషులు సలిపిన అవిరళ కృషి ఫలితంగా హిజ్రీ 14వ శతాబ్దిలో (20వ శతాబ్దిలో) ఇస్లాం సాంస్కృతిక పునరుజ్జీవనం జరిగిందని వక్తలు అభిప్రాయపడ్డారు.

ఉమ్మత్ ఏకత్వం కోసం ఉలమాలు, ఇస్లామీయ ఉద్యమ వైతాళికులు నిర్వర్తించిన భూమికలో భాగంగా మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మ.లై) మరియు జమాఅతె ఇస్లామీ పోషించిన పాత్రపై డా. అబ్దుల్ హఖ్ అన్సారీ (జమాఅతె ఇస్లామీ హింద్, మాజీ అమీర్) ప్రసంగించారు. అలాగే తౌహీద్(ఏక దైవారాధన) ప్రాతిపదికగా ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ నడిపిన ఉద్యమం గురించి షేఖ్ అబ్దుల్ రహ్మాన్ అబ్దుల్ ఖాలిఖ్ పరిచయం చేశారు. హసనుల్ బన్నా, ఇఖ్వానుల్ ముస్లిమీన్‌ల సేవలను ఈ సందర్భంగా వక్తలు శ్లాఘించారు.

తమదైన శైలిలో ఆయా దేశాలలో ధర్మసేవ చేసిన మహాపురుషుల జీవితాలను, వారి త్యాగాలను తెలుసుకుని, వారు అందించిన స్ఫూర్తిని పుణికి పుచ్చుకోవలసిన అవసరం నవతరానికి ఉందని, తద్వారానే ఉమ్మత్ ఏకత్వ సాధనకు మార్గం సుగమం అవుతుందని IPC స్థాపకులు షేఖ్ నాదిర్ అల్ నూరి అభిప్రాయపడ్డారు.









PAGE 12-13.pdf 11/27/07 8:35:19 PM

ఇస్లాం శిక్షణ

అల్లాహ్ ముస్లింల దేవుడా?



– హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్

అల్లాహ్ ఎవరు?

అనేక మంది ఆరాధ్యుల్లో నుంచి తమకు నచ్చిన ఒక్కరిని ఎంచుకొని జీవితాంతం ఆయనకే కట్టుబడి ఉండటం కూడా ఏకదైవారాధనే అవుతుందని కొందరు అనుకుంటారు. ఇది పెద్ద పొరపాటు. ఈ పొరపాటు జరగకుండా ఉండాలంటే ముందుగా **"అల్లాహ్"** అనే పదానికి గల అర్థం ఏమిటో తెలుసుకోవాలి.

"అల్లాహ్" అనేది అరబీ భాషాపదం. ఇది **"అల్"** మరియు **"ఇలాహ్"** అనే రెండు పదాలు కలిసి ఏర్పడింది. అల్ అనేది ఇంగ్లీషులో వాడబడే **THE** వంటి ఉపపదము– ఆర్టికల్. దీని అర్థం నిర్దిష్టమైన, నిర్ణీతమైన, ప్రత్యేకమైన, ఇంతకు ముందు ప్రస్తావించబడిన, ఏకైక మరియు వాస్తవమైన అని.

ఇప్పుడు ఈ రెండు పదాలను (అల్+ఇలాహ్) ను కలుపుదాం అల్లాహ్ అనే పదం ఏర్పడింది. అదే విధంగా దాని ప్రత్యేక అర్థం కూడా ఉనికిలోకి వచ్చింది. అనగా నిజ ఆరాధ్యుడు, ఏకైక ఆరాధ్యుడు, సాటిలేని ఆరాధ్యుడు, అసలైన ఆరాధ్యుడు, అందరికి తెలిసిన ఆరాధ్యుడు. ఇస్లాం దృష్టిలో సర్వలోకాల సృష్టికర్త మాత్రమే ఆరాధనలకు అర్హుడు. మిగతా జీవరాశులు, ఇతర సృష్టిరాశులు ఆరాధనలకు అనర్హమైనవి. ఎందుకంటే అవి కూడా తమ సృష్టికర్త ద్వారా ఉనికిలోకి వచ్చినవే. అవన్నీ అల్లాహ్ ఆజ్ఞ మేరకు తమ కాలం వెళ్ళబుచ్చుతున్నవి మాత్రమే. అంతిమ లక్ష్యం వైపు పయనిస్తున్నవి మాత్రమే.

అల్లాహ్ ముస్లింల దేవుడు మాత్రమే కాదు

అల్లాహ్ అంటే ముస్లిముల దైవం, ఇంకో పేరున మరో జాతి వారి దైవం అని జనం చెప్పుకుంటూ ఉంటారు. ఇది కూడా పొరపాటే. ఇస్లాం సర్వమానవాళిని ఒకే తల్లిదండ్రుల సంతానంగా పరిగణిస్తున్నది. వారందరి దైవం కూడా ఒక్కడే. ఆ దైవం మరియు ఆరాధ్యని వివరణ మరియు విశ్లేషణ దివ్యఖుర్ఆన్‌లో ఇలా ఉన్నది: **"మీరు చెప్పండి! ఆయన, అల్లాహ్ అద్వితీయుడు(ఒక్కడే). అల్లాహ్ నిరపేక్షాపరుడు (ఎవరి ఆధారము, అక్కరా లేనివాడు, అందరూ ఆయనపై ఆధారపడేవారే). ఆయనకు సంతానము ఎవరూ లేరు మరియు ఆయన ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులెవరూ లేరు."** (ఖుర్ఆన్ 112వ అధ్యాయం)

విశ్వప్రభువుకు అన్నివిధాలా శోభాయమానమైన పదం 'అల్లాహ్'

తెలుగులో మనం **'దేవుడు'** అంటాం. అరబీలో **"అల్లాహ్"** అంటారు. ఇంగ్లీషులో గాడ్ (**God**) అని అంటారు. ఇలా మానవుల ఆరాధ్య దైవాన్ని ఒక్కో భాషలో ఒక్కో పేరుతో పిలుస్తుండవచ్చు. కాని ఇన్ని పదాల్లోకెల్లా **"అల్లాహ్"** అనేది ఎంతో విలక్షణమైన పదం. విశ్వప్రభువుకు అది అన్ని విధాలా శోభాయమానమైన పదం.

'దేవుడు' అనే పదం బహువచనమయితే దేవుళ్లు అయిపోతుంది. స్త్రీలింగమయితే దేవత అవుతుంది. అలాగే ఇంగ్లీషులో కూడా **God** అనే పదం **gods** మరియు **godess** అవటానికి ఆస్కారముంది. కాని నిజానికి మానవుల ఆరాధ్య దైవం ఎన్నటికీ ఒక్కడే. ఆయన అస్తిత్వాన్ని సూచించటానికి బహువచన పదం అక్కర్లేదు. అలాగే ఆ పదం స్త్రీ పురుష భేదాన్ని సూచించేటట్టుగా కూడా ఉండరాదు. అరబీ భాషలోని అల్లాహ్ అనే పదం విశ్వప్రభువుకు అన్ని విధాలా శోభాయమానమైనదని చెప్పవచ్చు.

ఒక అపోహ

ముస్లిమేతరులకు ఇస్లాం గురించి వున్న అనేక పెద్ద అపోహల్లో **"అల్లాహ్"** అనే పదానికి సంబంధించిన అపోహ కూడా ఒకటి. ముస్లింలు క్రైస్తవుల, యూదుల దేవుణ్ణి కాకుండా వేరెవరో దేవుణ్ణి ఆరాధిస్తారని చాలా మంది అనుకుంటారు. కాని నిజానికి ఇదంతా ఓ అపోహ మాత్రమే. ఎందుకంటే **"అల్లాహ్"** అనే పదం దేవుడు అనే పదానికి పర్యాయపదం. దేవుడు అందరికీ ఒక్కడే.

దేవుడు ఎవరు? ఆయన అస్తిత్వం ఏమిటి? అనే విషయాల్లో యూదులు– క్రైస్తవులు–ముస్లింల మధ్య భేదాభిప్రాయాలున్నాయి, ఉదా; యూదులు క్రైస్తవుల్లో ఉన్న త్రిత్వభావన (**Trinity**) ను తిరస్కరిస్తారు. ముస్లింలు కూడా దాన్ని తిరస్కరిస్తారు. అంతమాత్రంచేత ఆ మూడు మతాలకు ముగ్గురు వేర్వేరు దేవుళ్ళు ఉన్నారని అర్థం కాదు. ఎందుకంటే –విశ్వమంతటికి నిజదేవుడు ఒక్కడే. ఇస్లాం చెప్పేది ఏమిటంటే– ఇతర మతాలవాళ్లు కూడా అల్లాహ్‌నే విశ్వసిస్తున్నారు. కాని అల్లాహ్‌ను ఏ విధంగా విశ్వసించాలో ఆ విధంగా విశ్వసించటం లేదు. దేవుడు ఫలానా విధంగా ఉంటాడని స్వయంగా కల్పనలు చేసుకుని విశ్వసిస్తున్నారు.

సరదా క్విజ్

? ప్రవక్త(స) పెదనాన్న 'అబూతాలిబ్' ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారా?

జ : లేదు. ఆయన ఇస్లాం స్వీకరించలేదు. బహుదైవారాధకునిగానే మరణించారు.

? ప్రవక్త(స) గారి నామాంతరమేది?

జ : అబుల్ ఖాసిం. పెద్ద కుమారుని పేరు ఖాసిం. అరబ్బు సాంప్రదాయం ప్రకారం పురుషులు పెద్దకుమారుని తండ్రిగా పిలవబడతారు.

? నేను దైవమార్గంలో బలి ఇవ్వబడిన ఇద్దరుల మహనీయుల వారసుడ్ని" అని చెప్పిన వారెవరు?

జ : ముహమ్మద్(స). ఇబ్రాహీం (అలై) కుమారుడు ఇస్మాయీల్(అలై) మరియు అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు అబ్దుల్లాహ్ – ఇద్దరూ అల్లాహ్ కొరకై బలి ఇవ్వడానికి సిద్ధమైన తరువాత అల్లాహ్ వారికి బదులుగా వేరే జంతువులను బలి ఇప్పించి వారిద్దరినీ రక్షించాడు.

? మహాప్రవక్త(స) పేరు విన్న తరువాత ఏమని చెప్పాలి?

జ: ప్రవక్త(స) పేరు విన్న లేదా చదివిన తరువాత "సల్లల్లాహు అలైహి వసల్లం" (అల్లాహ్ ఆయనపై శాంతి, శుభాల వర్షం కురిపించుగాక) అని చెప్పాలి.

? కాబా అంటే అర్థం?

జ: అల్లాహ్ దాస్యం కోసం భూమండలంపై మొట్టమొదటిసారి నిర్మించబడిన అతి ప్రాచీన దైవగృహం.

దాక్షిణ్యాలకు నోచుకోరు

- అబుల్ హసన్

దేవుడు వారికి ఇహపరాల్లోనూ సౌలభ్యాన్ని ప్రసాదిస్తాడు. దారి నుండి ఏదైనా హానికర వస్తువు తీసిపారేయడం కూడా పుణ్యం క్రిందికే వస్తుంది. అలా ఒక దయార్ద్ర హృదయుడే చేయగలడు. దౌర్జన్యపరుడు, కల్మష హృదయుడు ఇలా ఎన్నటికీ చేయలేడు. "ఇమాతతుల్ అజా అనిత్తరీఖీ సదఖా" అని తెలిసిన మీరు కఠినుల మార్గాన నడవకండి. కరుణ గలవారి దారినే సాగిపోండి. మీ జీవితాల్లో సుఖ శాంతులు వెల్లివిరుస్తాయి. మీ బ్రతుకుకి సార్థకత చేకూరుతుంది."

"ప్రజలారా! ఇంకో విషయం కూడా మీతో చెప్పాల్సి ఉంది. వితంతువులు, నిరుపేదల బాగు కోసం కృషి చేసేవాడు దైవ మార్గంలో పోరాడే యోధుడితో, అలుపెరగకుండా దైవారాధన చేసే భక్తుడితో, నిరంతరం ఉపవాసాలు పాటించే భక్తి పరాయణుడితో సమానం."

(బుఖారీ- ముస్లిం)

అలాగే మీ అధీనంలో, సంరక్షణలో ఉన్న అనాథల పట్ల మృదువుగా వ్యవహరించండి. మీ సంతానానికి- వారికి మధ్య విచక్షణను పాటించకండి. పక్షపాత వైఖరికి తావివ్వకండి. నన్ను, నా ఈ మాటను పూర్తిగా నమ్మండి - ఏ వ్యక్తి అయితే నిస్వార్థభావంతో కేవలం దైవ ప్రసన్నతను కోరుతూ, ప్రేమతో ఓ అనాథ బాలుడు మరియు బాలిక తలను నిమురుతాడో అతను వారిరువురి శిరోజాలంతటి పుణ్యాన్ని మూటగట్టుకుంటాడు. దైవం దృష్టిలో గృహాలన్నిటికంటే అతి ప్రియమైన గృహం ఏదో చెప్పనా? ఏ గృహంలోనైతే అనాథల ఆత్మాభిమానాన్ని, వారి వ్యక్తిత్వాన్ని గౌరవించడం జరుగుతుందో అదే శుభ నిలయం."

"మరో విషయం సైతం చెప్పాల్సి ఉంది. వాక్చాతుర్యం, వాక్పటిమ గల వ్యక్తుల పట్ల మంచిగా వ్యవహరించినట్లే, తమ గోడును, తమ అవసరాన్ని వెల్లడించలేని మూగ జీవుల పట్ల సైతం మీరు దయ కలిగి ఉండండి. అవసరార్థంగాని, ప్రయాణం కోసంగాని వాటిని తమతో పాటు తీసుకెళ్ళేటప్పుడు వాటి శక్తికి మించిన బరువును వాటిపై వేయకండి. అల్లాహ్ కూడా ఏ ప్రాణిపై దాని శక్తికి మించి బరువు వేయడని తెలుసుకోండి. వాటిపట్ల న్యాయంగా వ్యవహరించండి. న్యాయం అంటే ఏమని తెల్లబోతున్నారా! అవి మోయగలిగేంత బరువును మాత్రమే వేయాలి. దాంతోపాటు వాటికి కావాల్సిన మేతను వేయండి.



"ప్రజలారా! మీ తల్లిదండ్రుల గురించి దేవుడు చేసిన హితవును మరువకండి. దైవానికి ప్రీతికరమైన వాటిలో తల్లిదండ్రుల నిస్వార్థ సేవ కూడా ఒకటని గ్రహించండి. వారికి విధేయులై ఉండండి. వారిని శాంత పర్చండి. తస్మాత్ జాగ్రత్త! దైవ ప్రసన్నత తండ్రి ప్రసన్నతతో ముడిపడి ఉంది. తండ్రి ఆగ్రహంతో దైవాగ్రహం కట్టలు తెంచుకుంటుంది. తండ్రి స్వర్గానికి ప్రథమ ద్వారం అని మరువకండి. తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందన్న విషయాన్ని విస్మరించకండి. వారిరువురి కడుపు చల్లగా ఉంటేనే - రేపు హష్ర్ మైదానంలో మీకు దైవ సింహాసనపు చల్లని నీడ ప్రాప్తమవుతుంది సుమా!

"ప్రజలారా! దేవుని ప్రేమలో లీనమవండి. ఆయన ధర్మోన్నతి కోసం ప్రాణాలొడ్డి పోరాడటం కన్నా మించిన మంచి కార్యం మరొకటి లేదు. ఈ ప్రపంచం ఓ పరీక్షా స్థలం. ఇక్కడ మంచి చెడు చేసే స్వేచ్ఛ మీకుంది. రేపు రానున్న రోజు తీర్పు దినం. అక్కడ లభించే శాశ్వత కీర్తిప్రతిష్టలు దైవ ప్రసన్నత కోసం అహర్నిశలు పరిశ్రమించే వారికి మాత్రమే వర్తిస్తాయి.

"కనుక స్వర్గంలో ప్రవేశించాలన్నా, దైవ దర్శన భాగ్యం లభించాలన్నా నిస్వార్థ సేవతో ముందడుగు వేయాలి. భూమ్యాకాశాలంతటి విశాలం గల స్వర్గం వైపు సాగిపోండి. మీరు మీ అవసరాలకు ప్రాధాన్యతనిచ్చినట్లే, ఇతరుల అక్కరలకు సైతం ప్రాముఖ్యాన్నివ్వండి. స్వార్థాన్ని, సంకుచిత భావాన్ని విడనాడండి. పరస్పరం సోదరులుగా దైవ దాసులై జీవించండి. గుర్తుంచుకోండి! 'స్వార్థం' అనే ఈ విష వాయువే గతించిన సమాజాలను పొట్టనబెట్టుకుంది. ముస్లిం సముదాయం విషయంలో మొట్ట మొదట ఇహపరాల దృష్ట్యా, ప్రయోజనం రీత్యా లాభదాయకమైనది త్యాగం, కరుణ, జాలి అని తెలుసుకోండి. ఈ సముదాయాన్ని మట్టు పెట్టేవాటిలో మొదటిది కాఠిన్యం, కరకుదనం, స్వార్థం, అసూయా ద్వేషాలు అని మరువకండి.

"నిస్సందేహంగా ధర్మం సులువైనది. ధర్మం విషయంలో సైతం కాఠిన్యం గల వ్యక్తి ఎక్కువ కాలం నిలువజాలడు. కనుక సన్మార్గంపై నడవండి. మధ్యేమార్గాన్ని అనుసరించండి. ఇంకా ఉదయం, సాయంత్రం మరియు రాత్రి పూట కొంత సేపు ఆరాధనకై వెళ్ళండి . ఇలా గనక మీరు చేస్తే అలుపు సొలుపూ లేకుండా నిక్షేపంగా గమ్యానికి చేరుకుంటారు."

ఫ ఆఖిరు దావాన అనిల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ -

PAGE 14-15.pdf 11/27/07 8:38:02 PM

దయలేని వారు దయా

సర్వవిధముల స్తోత్రములు సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్‌కు మాత్రమే చెందుతాయి. మేము ఆయన్నే కీర్తిస్తున్నాము. ఆయన్నే ఆరాధిస్తున్నాము. సహాయం కొరకు ఆ ఆపద్బాంధవుడినే ఆర్థిస్తున్నాము.

"ప్రజలారా! నేను మీకు ప్రేమాభిమానాలు మమతానురాగాలు, అనుబంధం – ఆత్మీయతల గురించి హితవు చేస్తున్నాను. ఓ మంచి మాటను మీతో చెప్పగోరుతున్నాను. శ్రద్ధగా ఆలకించండి! నా ప్రభువు ఇలా అంటున్నాడు: నాకు కరుణ, దయ, జాలి అంటే ఎంతో ఇష్టం. దయ, జాలి లేని వ్యక్తి నా కటాక్షాలకి దూరంగా ఉంటాడు". దైవ కారుణ్యానికి దూరమవటం ఎంతటి దౌర్భాగ్యమో మీరు గ్రహించారా? ఇది ఎలాంటి దుష్పరిణామానికి దారి తీస్తుందో ఆలోచించారా!?

"దైవ దాసులారా! నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. దయలేని వ్యక్తి మీద దయజూపడం జరగదు. ఎప్పటివరకైతే మీరు దైవ సృష్టితాల పట్ల దయ కలిగి వుండరో అప్పటి వరకు దేవుని కరుణ మిమ్మల్ని తన బాహువుల్లో సేదతీరేందుకు చోటివ్వదు. ప్రతి నిమిషం, ప్రతి ఘడియ మీకు దైవ కరుణ అవసరం ఉంది. ఆ దయా సాగరుడు సాటి ప్రజల పట్ల దయ కలిగి ఉండమని హితవు చేస్తున్నాడు. అలా గనక మీరు చేస్తే దైవకారుణ్య కడలి మీ కొరకు ఉప్పొంగుతుంది. బీటలు వారిన మీ మనోభూమి పచ్చని గుణాలతో కళకళ్ళాడుతుంది. మీ జీవితాలు కష్టాల పండు వేసవిలో సుఖశాంతుల నిండు వసంతంగా మార్చివేయబడతాయి.

"ఏ శక్తి స్వరూపుని అధీనంలోనైతే నా ప్రాణం ఉందో ఆ సర్వోన్నతుని సాక్షి ! స్వర్గమనే అనంత సౌఖ్యాల నిలయంలో కరుణ గల వారు తప్ప ఇతరులు కాలు మోపలేరు. రేపు తీర్పు దినాన ఆ సత్య స్వరూపుడు తన సృష్టి రాసుల పట్ల కఠినంగా ప్రవర్తించినవారిని, బాధించిన వారిని, ఇక్కట్లకు గురిచేసి వారి జీవితాలను వీధిపాలు చేసినవారిని కఠినంగా శిక్షిస్తాడు. నా ప్రభువు చేసిన ప్రమాణం ఏమిటంటే? "నా దయను కోరుకొనేవారు నా దాసులపట్ల దయ కలిగి ఉండాలి". నేను మీకు చెబుతున్నది ఏమిటంటే "సౌలభ్యాన్ని కలుగజేయండి. ప్రజలను కాఠిన్యానికి గురి చేయకండి. శుభవార్తలు అందజేయండి. ద్వేషం, అసహ్యం కలిగించే మాటలు చెప్పకండి".

(బుఖారీ, ముస్లిం)


బాగా గుర్తుంచుకోండి! దేవుడు మృదు స్వభావి. ఆయన మృదుత్వాన్ని ఇష్టపడుతాడు. కాఠిన్యం వల్లగాని, మరే ఇతర విషయం వల్లగాని ప్రసాదించనిది అల్లాహ్ మృదుత్వం మూలంగా ప్రసాదిస్తాడు. (ముస్లిం)

దైవ దాసులారా! మీతో మరో మాట కూడా చెప్పాల్సి ఉంది. ఒకరికి మేలు చేయడం అనేది పూర్తిగా కరుణకు సంబంధించిన విషయమే. కఠిన మనస్కుని మూలంగా ఏ ప్రాణికీ మేలు చేకూరదు. జాలి గుండె గల వ్యక్తితోనే మంచిని ఆశించగలం. మేలు చేయడం జాలి స్వభావానికి అతి పెద్ద నిదర్శనం అని తెలుసుకోండి. కొన్ని విషయాలు ఇక్కడ ఉదాహరిస్తున్నాను: వికలాంగులు, వ్యాధిగ్రస్తుల పట్ల దయ చూపడం అంటే –, అతను పూర్తిగా కోలుకొని పూర్వ స్థితికి చేరుకొనేంతవరకు అవసరమైన వైద్య సదుపాయాలను సమకూర్చి పెట్టి, అతనికి కావాల్సిన తిండి బట్టలను అందించాలి. ఒక ముస్లిం తోటి ముస్లింను ఉదయం పూట పరామర్శిస్తే, డెబ్భై వేల దైవ దూతలు సాయంత్రం వరకూ అతని శ్రేయస్సు కోసం దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటారు. అదే సాయంత్రం వేళ పరామర్శిస్తే, ఉదయంవరకూ దైవ దూతలు అతని యోగక్షేమాల కోసం ప్రార్థిస్తూ ఉంటారు. ఇంకా అతని కోసం స్వర్గ ఫలాలు ఏరి కూరి ఉంచబడతాయి (తిర్మిజీ). ఒక ముస్లిం తన సోదర ముస్లింను పరామర్శించడానికి వెళ్ళి తిరిగి వచ్చేంతవరకు స్వర్గపు తాజా పండ్లు ఏరుతూ ఉంటాడు. (ముస్లిం)

"అలాగే ఎవరికైనా కష్టకాలం దాపురించి ఉంటే అతనికి చేయూతనిచ్చి, చేతనైనంత సహాయ సహకారాన్ని అందించి గట్టెక్కించడాన్నే 'దయ' అంటారు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్న ఒక అభాగ్యునికి సౌలభ్యాన్ని చేకూరిస్తే



ఓ విశ్వాసీ! నీ స్థాయిని తెలుసుకో



–ముహమ్మద్ ఇక్బాల్

ఇస్లాం మూల విశ్వాసాల్లో 'హజ్జ్' అయిదవది. స్థోమత గల ప్రతి ముస్లిం (స్త్రీ, పురుషుడు) జీవితంలో ఒక్క సారైనా హజ్జ్ చేయాలి.

హజ్జ్ గురించి అల్లాహ్ ఆదేశం ఇది: **"ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ (కాబా) గృహానికి వెళ్ళే శక్తి గలవారు దాని హజ్జ్‌ను విధిగా చేయాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని తెలుసుకోవాలి."** (ఆలి ఇమ్రాన్- 97)

దైవసామీప్యానికి చేర్చే సత్కార్యాలలో హజ్జ్ ముఖ్యమైనది అని మహనీయ ముహమ్మద్(స) వారు చెప్పారు. ఆయన(స) ఇలా ప్రవచించారు: **"ఎవరైతే ఎలాంటి విషయలోలత్వానికి, దైవాజ్ఞల ఉల్లంఘనకు పాల్పడకుండా (సక్రమంగా) హజ్జ్ విధిని నెరవేరుస్తాడో అతడు అప్పుడే మాతృగర్భంలో జన్మించిన శిశువులా (పరిశుద్ధుడై) తిరిగి వెళతాడు".** (బుఖారీ, ముస్లిం)

మోమిన్ (విశ్వాసి) మాన మర్యాదలు

ఒకసారి దైవప్రవక్త(స) గారు మక్కా నగరాన్ని ఉద్దేశించి **"నీవు (మక్కా) నా దృష్టిలో యావత్తు దేవుని భూమండలం కంటే ఎంతో ప్రియమైన దానవు. నేను (స) ఎప్పుడైనా నిన్ను వదలి వెళ్ళవలసి వస్తే సంతోషంగా వదలి వెళ్లలేను"** అని అన్నారు.

పై ప్రవచనం వల్ల మక్కా నేల (స్థలం) సమస్త భూమండలములో కెల్లా ఎంతో శ్రేష్ఠమైనది అని తెలియుచున్నది. ఈ పవిత్ర మక్కా పట్టణంలోనే దైవగృహము కలదు, దానినే కాబా గృహం అంటారు. మరొకసారి ఇలా కూడా అన్నారు: "నీవు ఎంత అద్భుతమైన దానవు, ఎలాంటి సువాసన నీది, ఎంత మంచి దానవు, ఎంత ఉన్నతమైన గౌరవ మర్యాదలు నీవి అంటూ, మోమిన్ (విశ్వాసి) గుణగణాలను గూర్చి ప్రస్తావిస్తూ, **"ఎవరి అధీనంలో నా ప్రాణం వుందో ఆయన సాక్షి! దేవుని దృష్టిలో ఒక మోమిన్ (విశ్వాసి) యొక్క ధన,మాన-ప్రాణాలు, పవిత్ర మక్కా కంటే కూడా ఎంతో ఉన్నతమైనవి, విలువైనవి"** అంటూ మోమిన్ ధన-మాన-ప్రాణాలు గూర్చి కొనియాడారు, మరొక సందర్భంలో కాబా గృహాన్ని ప్రదక్షిణ చేయసాగారు. ఆయన(స) గారి వెంట అబ్దుల్లా-బిన్ మసూద్ కూడా ఉన్నారు. అప్పుడు కాబా గృహాన్ని ఉద్దేశించి ఇలా అన్నారు; **"ఓ! దైవ గృహమా! నీవు ఎంత ఔన్నత్యం గలదానవు! ఎంత పవిత్రమైన దానవు! ఎంత గొప్ప మర్యాద గల దానవు! అని పలికి, ఆ తరువాత, అయితే నీకంటే కూడా పవిత్రమైన, ఔన్నత్యం గౌరవ మర్యాదలు గల వస్తువు మరొకటి ఉంది"** అని అన్నారు. ఈ మాట విన్న అబ్దులాహ్ బిన్ మసూద్(రజి) గారు 'మరొక వస్తువు ఉందా'? అని ఆశ్చర్యపోయారు. అప్పుడు దైవప్రవక్త(స) **"అవును ! అది ఒక (విశ్వాసి) యొక్క ధన-మాన ప్రాణాలు"** అని అన్నారు. **"జిల్ హజ్జ్' మాసంలో అరఫాత్ రోజు ఎంత పవిత్రమైనది అంటే అక్కడ హత్యలు, కొట్లాటలు, నాశనాలు ఎలా నిషిద్ధమైనవో అలాగే మీ రక్తం మీ ధనం మీ ప్రాణాలు కూడా మీ కొరకు అంతే పవిత్రమైనవి". దాని భావం ఏమనగా నేరాలు, ఘోరాలు, హత్యలు, కొట్లాటలు మోసపూరితమైన పనులు అలాగే నిషిద్ధమైనవి.**

దేవుని దృష్టిలో **'మోమిన్'** యొక్క స్థానం ఎంత విలువైనదో ఆలోచించండి. అందుకే మోమినులము అయిన మనం "అల్లాహ్‌కు ఏ విధముగా భయపడాలో ఆ విధముగా భయం కలిగి జీవిస్తూ సాటి విశ్వాసులకు అపకారం తలపెట్టకుండా, వారి మాన మర్యాదలకు విఘాతం కలిగించకుండా జాగ్రత్త పడాలి. మనం హజ్, ఉమ్రాలకు వెళ్ళినప్పుడు కాబా గృహంపై దృష్టి పడగానే నిలువెల్లా కంపించి పోతాము. భక్తి పారవశ్యాలతో అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతాము. కాబా గృహంపై ఉన్న 'పరదా' ను పట్టుకుని విలపిస్తాము. ముద్దులు కురిపిస్తాము. అదే సమయంలో సాటి మోమిన్ పట్ల మన వైఖరి ఎలా వుందో మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. దేవా! విశ్వాసుల హృదయాలను కలుపు. వారి మధ్య నిజమైన ప్రేమానురాగాలను సృజించు. అరాచకం, అశాంతి వై మనస్యాలను తొలగించి శాంతి సామరస్యాల శుభప్రదమైన వాతావరణాన్ని ప్రసాదించు.

(ఆమీన్)



PAGE 16-17.pdf 11/27/07 8:39:43 PM

మహానాడు మహత్తు

- అబూ అతీఖ్

హజ్జ్ దినాలు స్వతహాగా ఎంతో మహత్తు గలవి. అందులోనూ అరఫా దినం అంటే అది మరింత మహత్తును సంతరించుకున్న దినం. ఆ రోజునే హజ్ యాత్రీకులు అరఫాత్ మైదానంలో విడిది చేస్తారు.

అరఫా దినం గొప్పదనం గురించి అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏమన్నారో చూడండి: "శాపగ్రస్తుడైన షైతాను అరఫా దినాన కుమిలి పోయినంతగా మరెన్నడూ కుమిలిపోడు. ఆ రోజు వాడు ఎంతో అవమానితుడై, అల్పుడై, తీవ్రంగా మనస్తాపం చెందుతాడు. ఎందుకో తెలుసా! ఆ రోజున దైవకారుణ్యం అదే పనిగా వర్షిస్తూ దైవభక్తుల పెద్దపెద్ద పాపాలను ప్రక్షాళనం చేస్తూ ఉంటుంది. అరఫా దినం గాకుండా ఆ దైవధూత్కారి చాలా ఎక్కువగా పరాభవం పాలైన దినం మరేదైనా ఉందా అంటే అది 'బద్ర్ దినం' అని చెప్పాల్సి ఉంటుంది." 'ఎందుచేత?' అని దైవ ప్రవక్త(స)ను ప్రశ్నించగా, "ఎందుకంటే, బద్ర్(యుద్ధ) దినాన దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) సయితం తన సేనల సమేతంగా దివి నుంచి భువికి దిగివచ్చి యుద్ధం చేయటాన్ని షైతాన్ తదేకంగా తిలకించాడు. దైవతిరస్కారులకు వ్యతిరేకంగా విజృంభించమని సేనలను పురికొల్పటం చూసి అవమానంతో కృంగిపోయాడు" అని ఆయన సమాధానమిచ్చారు.

హజ్జ్ ఓ మహా యజ్ఞం. ఈ ఆరాధన జిల్‌హజ్జ 8వ తేదీన మొదలై 13వ తేదీన పూర్తవుతుంది. ఈ ఆరు దినాలలో ఒక్కో దానికి ఒక్కో ప్రాముఖ్యత ఉంది. ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేక పేరు కూడా ఉంది.

మొదటి రోజు

హజ్జ్ మొదటి దినం **'యౌమిత్తర్వియా'** గా పిలవబడింది. ఎందుకంటే అప్పట్లో ఈ రోజున హాజీలు ఒంటెలపై స్వారీ అయి హజ్ క్రియలకని బయలుదేరేవారు. కాబా దగ్గరవున్న వారంతా మొదటి విడత కాబా ప్రదక్షిణ చేసి, తమ వాహనాల ద్వారా **'మినా'** ప్రదేశానికి వెళుతూ ఒంటెలకు నీరు త్రాపేవారు.

రెండవ రోజు

రెండవ దినం **'యౌమె అరఫా'** గా పిలవబడుతుంది. కారణం: ఆ రోజునే హాజీలు అరఫాత్ ప్రదేశంలో ఆగి హజ్ క్రియలు నెరవేరుస్తారు.

మూడవ రోజు

మూడవ రోజును **'యౌమున్నహర్'** గా వ్యవహరించటానికి కారణమేమంటే, ఆనాడే హాజీల తరఫున పశువులు ఖుర్బానీ ఇవ్వబడతాయి.

చివరి మూడు రోజులు

ఆఖరి మూడు రోజులు **'అయ్యామె తష్రీఖ్'** గా వ్యవహరించబడ్డాయి. తష్రీఖ్‌కు ఒక అర్థం: **'దేదీప్యమానం'**. ఈ మూడు దినాలలో చంద్రకాంతి ప్రకాశమానంగా ఉంటుంది. రెండో అర్థం: ఖుర్బానీ పశువుల మాంసాన్ని ఆరబెట్టడానికి మాంసాన్ని చీల్చవలసి ఉంటుంది. ఆ కారణంగా ఈ మూడు దినాలను అయ్యామె తష్రీఖ్ అని అన్నారు.



"అసలు అరఫాలో ఆగటమే హజ్జ్" అని కూడా దైవప్రవక్త (స) వక్కాణించారంటే అరఫా దినానికి గల ప్రాముఖ్యత ఎటువంటిదో అంచనా వేయవచ్చు. ఒకవేళ హజ్ యాత్రీకునికి గనక అరఫాత్ మైదానంలో విడిది చేసే అవకాశం దొరక్కపోతే అతని హజ్ నెరవేరదన్నమాటే. అరఫా దినం ప్రార్థనలు స్వీకరించబడే దినం. అందుకే ఆ దినం షైతాను పాలిట గడ్డు దినంగా పరిణమిస్తుంది.

అంతిమ హజ్జ్ యాత్ర సందర్భంగా దైవప్రవక్త(స) అరఫాత్ మైదానానికి విచ్చేసి, జుహ్ర్ అస్ర్ నమాజులు చేసిన పిదప ఎంతో ఏకాగ్రతతో, వినమ్రతా భావంతో వేడుకోళ్ళ (దుఆలు చేయటం)లో నిమగ్నులైపోయారు. కాని మధ్యలో ఆయన మోముపై మందహాసం కూడా వ్యక్తమయింది. ఆయన ప్రక్కనే ఉండి, హజ్జ్ క్రియలను నెరవేరుస్తున్న హజ్రత్ అబూబక్ర్(రజి) ఆశ్చర్యపోయి ఇలా అడిగారు: "అగ్రజా (స)! నా తల్లిదండ్రులను మీకు అర్పింతు! ఈ రోజంతా తమరు ఎంతో అశక్తతా భావంతో, ఏకాగ్రతతో గడిపారు- మీతోపాటు ఇతర హాజీల పరిస్థితి కూడా అలాగే ఉంది. కాని మధ్యలో అకస్మాత్తుగా తమరి మోముపై చిరునవ్వు తొణికిసలాడింది. ఆ మాటకొస్తే అనునిత్యం మీ ముఖారవిందం చిరునవ్వులు చిందిస్తూ ఉండాలన్నదే మా అందరి అభిలాష. అది వేరే విషయం. కాని మధ్యలో తమరు అనూహ్యంగా చిరునవ్వు ఎందుకు నవ్వారో మేము తెలుసుకోవచ్చా?" సమాధానంగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను ఆపాదమస్తకం ఏకాగ్రతతో ప్రార్థనలో లీనమైన విషయం నిజమే. అయితే అంతలోనే ఒక దృశ్యం నా కళ్ల ముందు కనిపించింది. ఉదాత్తుడైన ప్రభువు మన్నింపుల వైఖరికి, కారుణ్య వర్షానికి అసూయతో రగిలిపోయిన షైతాన్ అరఫాత్ మైదానంలోని ఇంత మట్టిని తీసుకుని తన నెత్తిమీద పోసుకుంటూ, తన్ను తానే నిందించుకోసాగాడు. అది చూసి నాకు అప్రయత్నంగా నవ్వొచ్చింది."

మళయు మహిళలు

తెలుగు రూపం
శ్రీమతి మాలతీ చందూర్

ఇస్లామ్ ఆవిర్భవించక ముందు ఆరబ్బులో భార్యల సంఖ్యపై ఆంక్ష ఏదీ ఉండేది కాదు. మహాప్రవక్త (సఅసం) పురుషుని మనస్తత్వాన్ని, అతని అవసరాలను దృష్టిలో ఉంచుకుని, హద్దుపద్దూ లేని ఈ 'సంఖ్య'ను 'నాలుగు'కు కుదించారు.



ఇస్లామ్ ఆవిర్భవించక పూర్వం అరబ్బు ప్రపంచంలో వివాహానికి సంబంధించిన ప్రత్యేక నియమం ఏదీ ఉండేది కాదు. పురుషుడు తన చుట్టూత భార్యలను, ఉంపుడుకత్తెలను ఉంచుకునే సంప్రదాయం ఆనాడు సర్వసాధారణం. విడాకులను గురించి కూడా ప్రత్యేక నియమం, ఆంక్ష అంటూ ఏదీ లేదు. పురుషుడు తాను తలచినప్పుడల్లా విడాకులిచ్చేవాడు. ఈ నికృష్ట పరిస్థితుల్ని సంస్కరించడానికి దైవం తరఫున ఆజ్ఞలు వచ్చాయి. పరిమిత సంఖ్యలోనే పెండ్లిండ్ల అనుమతినివ్వబడింది. విడాకుల విషయంలో సముచితమైన నియమాలు, నిబంధనలకు కట్టుబడిపుండవలసినదిగా ఆజ్ఞాపించటం జరిగింది.

దివ్యఖుర్‌ఆన్‌లో ఉంది:

> **"అనాధలకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసిగాని, ముగ్గురేసిగాని, నలుగురేసిగాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే సంశయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి. లేదా మీ స్వాధీనంలోకి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. అన్యాయానికి దూరంగా ఉండేందుకు ఇది అత్యుత్తమ మార్గం."** (ఖుర్‌ఆన్ 3)

ఈ బోధనల్లో దాగివున్న వివేచనను గూర్చి ఆలోచించండి: భార్యపట్ల న్యాయంగా వ్యవహరించాలి. బహుభార్యాత్వపు అనుమతి కూడా ఉంది.

అయితే దానితోపాటు వారి మధ్య అన్యాయం జరగకుండా చూడాలన్న తాకీదు కూడా ఉంది. న్యాయం చేకూర్చటం సాధ్యపడదన్న సంశయముంటే ఒక వివాహంతోనే సంతృప్తిపడాలని గట్టిగా చెప్పబడింది.

పురుషునికి ఏ సమయంలోనయినా తన లైంగిక వాంఛను తీర్చుకోవలసిన అవసరం ఆసన్నం కావచ్చు. కనుక ప్రకృతి అతనికి అన్ని అవస్థల్లోనూ కోర్కెలకు అర్హునిగా చేసింది. కాని స్త్రీల స్థితి ఇందుకు భిన్నమయింది.

రుతుస్రావం జరిగే రోజుల్లో, గర్భవతిగా ఉన్నప్పుడు (9,10 మాసాలు), ప్రసవించిన తరువాత కొంతకాలంపాటు స్త్రీ భర్తతో దాంపత్య జీవితం గడపజాలదు.

అందరు పురుషులూ అత్యంత సహనంతో ఉంటారని, తమ భార్యలు దాంపత్య జీవితానికి అర్హులయ్యే వరకూ ఆవేశాన్ని అదుపులో ఉంచుకుంటారని ఆశించటం సరయినది కాదు. ధర్మసమ్మతమయిన మార్గంలోనే పురుషుడు తన కోర్కెల్ని తీర్చుకోగలిగేలా అతనికై ద్వారాలు తెరచి ఉంచటం అవసరం. ధర్మసమ్మతం కాని మార్గంలో పోవడం తప్ప గత్యంతరం లేదన్న సంకట స్థితిలో అతన్ని పడనివ్వకూడదు. అలా ఉంటే అతనికి భార్య అయితే ఒకటే కాని ప్రియురాళ్ళు అనేక మంది తయారవుతారు. అదే జరిగితే సమాజంలో వ్యాపించే నైచ్యం, దిగజారిపొయ్యే నైతికత గురించి ఊహించటం మీకు కష్టమేమీ కాదు.

వ్యభిచారాన్ని నిషేధించి, బహు భార్యాత్వాన్ని చట్టబద్ధం చేసిన పవిత్ర ధర్మం ఇస్లామ్ ధర్మమే. ఒకటికంటే ఎక్కువ వివాహాలను కొన్ని ఆంక్షలతో అనుమతించి స్త్రీ – పురుషుల శారీరక నిర్మాణం, వారి మనస్తత్వాలు, వారి అవసరాలకు పూర్తి న్యాయం చేకూర్చింది ఇస్లామ్. ఈ విధంగా ఇస్లామ్ మన ముందు ఒక సశాస్త్రీయమయిన ధర్మంగా నిరూపితమవుతోంది.

('నేను ఆరాధించే ఇస్లాం' నుండి)

PAGE 18-19.pdf 11/27/07 8:36:51 PM

ఇస్లాం



తమిళ మూలం
అడియార్

ఇస్లాం మరియు ముస్లిమ్‌ల గురించి అనేక అపార్థాలు ఉన్నాయి. వాటిలో ముస్లిమ్ స్త్రీలను గురించిన అపార్థాలు మరికొన్ని.

ఇస్లామ్ ఆవిర్భావానికి ముందు సాధారణంగా ప్రతి సమాజం, ప్రతి వ్యవస్థలో స్త్రీని అధమంగా చూచేవారు. ఆమెను అవమానపరిచేవారు. ఆమెపై రకరకాల దౌర్జన్యాలు జరిగేవి.

హిందూ సమాజంలో, భర్త చనిపోతే అతనితోపాటు భార్య కూడా చితిపై కాలిపోవలసివచ్చేది.

చైనాలో స్త్రీ కాలికి బిగువయిన ఇనుప బూట్లు తొడిగించబడేవి (చిన్న కాళ్ళు అందమయినవిగా భావించి వాటి పెరుగుదలను అరికట్టడానికి).

అరేబియాలో బాలికలను సజీవంగా పాతిపెట్టేవారు.

ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా ధ్వజమెత్తిన సంస్కర్తలు ఈ మధ్య కాలంలోనే ప్రభవించారన్న దానికి చరిత్ర సాక్ష్యం. కాని ఈ యావత్తు సంస్కర్తలకంటే శతాబ్దాలకు ముందు అరబ్ భూభాగంలో **ప్రవక్త (సఅసం)** అతివల యెడల మహోపకారిగా ప్రభవించారు– కోమలాంగులపై జరిగే దౌర్జన్యాలను అంతమొందించారు.

స్త్రీ హక్కులేవో తెలీని అరబ్ సమాజంలో **ప్రవక్త మహనీయులు**, స్త్రీకి పురుషునితో పాటు సమాన స్థాయిని కల్పించారు. నాడు స్త్రీకి ఆస్తిపాస్తుల్లో ఎలాంటి హక్కు ఉండేది కాదు. **ప్రవక్త మహనీయులు** ఆమెకు వారసత్వపు హక్కును నిర్ణయించారు. స్త్రీ హక్కుల్ని ప్రకటిస్తూ దివ్య ఖుర్‌ఆన్ ఆజ్ఞలు వచ్చాయి.

తల్లిదండ్రులు తదితర బంధువుల ఆస్తిపాస్తుల్లో స్త్రీలను కూడా వారసులుగా నిర్ణయించడమయింది. నేడు నాగరికత గురించి గొంతెత్తి ఘోషించే అనేక దేశాలలో స్త్రీకి ఆస్తి హక్కుగాని, ఓటు హక్కుగానీ లేదు. ఇంగ్లండులో స్త్రీకి ఓటు హక్కు 1928లో ప్రప్రథమంగా ఇవ్వబడింది. హిందూ సమాజంలో స్త్రీకి ఆస్తి హక్కు మొన్నమొన్ననే ప్రాప్తమయింది. (అదీ అన్ని చోట్లా కాదు!)

అయితే నేటికి 14 వందల ఏండ్ల క్రితమే ఈ హక్కులన్నింటినీ స్త్రీలకి వర్తింపజేసిన **మహనీయ ముహమ్మద్ (సఅసం)** ఎంత గొప్ప మహోపకారి!

ఆయన (సఅసం) తన బోధనల్లో స్త్రీల హక్కుల విషయమయి నొక్కి చెప్పారు– స్త్రీల పట్ల పురుషులు తమ బాధ్యతను విస్మరించరాదని, న్యాయసమ్మతంగా స్త్రీల హక్కులను నెరవేర్చాలని నాయక శిఖామణి తన అనుయాయులకు తాకీదు చేశారు. స్త్రీలను కొట్టరాదని ఆయన హితబోధ చేశారు.

స్త్రీల పట్ల ఏవిధంగా ప్రవర్తించాలి అనే విషయంలో **ఆయన (సఅసం)** ప్రవచనాలను గమనించండి:

(1) తన భార్యను కొట్టేవాడు మంచి నడతగలవాడు కాడు.

(2) మీలో ఎవరయితే తన భార్య పట్ల ఉత్తమంగా ప్రవర్తిస్తాడో అతడే అత్యుత్తమ వ్యక్తి.

(3) స్త్రీలతో శ్రేష్ఠమయిన రీతిలో ప్రవర్తించమని దైవాజ్ఞ కలదు. ఎందుకంటే వారు మీ తల్లులు, మీ చెల్లెళ్ళు, మీ కూతుళ్ళు.

(4) తల్లి పాదాల క్రింద స్వర్గముంది.

(5) ఏ ముస్లిమూ తన భార్యను అసహ్యించుకోరాదు. ఒకవేళ ఆమెలో ఏదైనా ఒక లోపం ఉంటే, ఆమెలోని మరో ఉన్నత గుణాన్ని చూచి భర్త సంతోషించాలి.

(6) భార్యను బానిసలాగా చూడకండి. ఆమెను హింసించకండి.

(7) మీరు తింటే మీ భార్యల్ని కూడా తినిపించండి. మీరు తొడిగితే, మీ భార్యలకు కూడా తొడిగించండి.

(8) భార్యను దెప్పి పొడవకండి. ఆమె ముఖంపై కొట్టకండి. ఆమె మనసును నొప్పించకండి. ఆమెను వదలి వెళ్ళిపోకండి.

(9) భార్య తన భర్త స్థానాన సర్వాధికారాలు గల రాణి.

(10) తమ భార్యల పట్ల మంచి ప్రవర్తన చూపేవారు మీలో మంచివారు.

ఇన్ని హక్కులను ప్రసాదించి స్త్రీని విచ్చలవిడిగా వదిలిపెట్టలేదు. ఆమెని కొన్ని విధుల పరిధులకు బద్ధురాలుగా చెయ్యడం జరిగింది.

1. భర్త తనను చూడగానే సంతోషపడేలాంటి సద్వర్తన కలిగి ఉండాలి. భర్త ఆదేశిస్తే దాన్ని నిర్వర్తించాలి. భర్త దూరాన ఉంటే అతని సంపత్తిని మరియు తన శీలాన్ని పరిరక్షించుకోవాలి– ఇలాంటి స్త్రీయే ఉత్తమమయిన భార్య అనబడుతుంది.

2. ఉత్తమ నడవడిక గల భార్య లభించడం అనుపమ సంపదకు సమానం.

3. రోజూ 5 పూటలు నమాజ్ చేసి, రమజాన్ మాసంలో రోజా (ఉపవాసం) వ్రతం పాటించి, తన భర్త ఆజ్ఞల్ని నిర్వర్తించి, తన శీలాన్ని పరిరక్షించుకున్న స్త్రీ, తాను కోరిన ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశించవచ్చు.

4. ప్రపంచంలోని యావత్తు సంపదలలోకెల్లా విలువైనది, సద్గుణవతి, సౌశీల్యవతి అయిన భార్య.

ఈ విధంగా **మహాప్రవక్త (సఅసం)** స్త్రీకి హక్కుల్ని ఇవ్వడంతోపాటు, ఆమె విధులను కూడా గుర్తు చేశారు.

స్త్రీలకి ఇన్ని హక్కుల్ని ప్రసాదించిన ఇస్లామ్‌లో బహు భార్యాత్వానికి అనుమతి ఎందుకు ఇవ్వబడింది? ఇది స్త్రీలపై దౌర్జన్యం కాదా? అన్నది ఓ ఆక్షేపణ.

ఈ విషయంలో మనం పురుషుని నైజాన్ని, జీవితంలో ఎదురయ్యే క్రియాత్మక సమస్యల్ని దృష్టిలో ఉంచుకోవాలి.

భారత దేశపు దశరథ మహారాజుకు అనేక మంది భార్యలుండేవారు. మనం శ్రీకృష్ణుణ్ణి, రుక్మిణి, సత్యభామ, రాధలే కాకుండా అసంఖ్యాక గోపికల మధ్య చూస్తున్నాము... 'వల్లీ' మహిళలతో మురుగన్ లాంటి దేవత గడపటం మనం చూస్తున్నాము. ఇవయితే ప్రాచీన కాలంనాటి, పురాణాల సంగతి. ఇప్పుడు చారిత్రక విషయాలను తీసుకోండి– పెద్ద పెద్ద రాజుల వద్ద అనేక భార్యలుండేవారు.

తమిళనాడులోని కట్టబ్రాహ్మణునికి అనేకమంది భార్యలు.
నేటికీ కొందరు రాజకీయ నాయకులు అనేక భార్యలు కలిగి ఉన్నారు.

قال رسول الله ﷺ:

اغتنم خمساً قبلَ خمسٍ

وصحتك قبل سقمك

وفراغك قبل شغلك

وشبابك قبل هرمك

وغناك قبل فقرك



ఓ మనిషీ !

నిన్ను నీవు తెలుసుకో.

నువ్వు చేయాల్సిందేమిటి? చేస్తున్నదేమిటి??

IPC


ISLAM PRESENTATION COMMITTEE

Ext. 110 **2444117**


www.thelastingmiracle.com

مَثَلُ الَّذِينَ اتَّخَذُوا مِن دُونِ اللَّهِ أَوْلِيَاءَ كَمَثَلِ الْعَنكَبُوتِ اتَّخَذَتْ بَيْتاً وَإِنَّ أَوْهَنَ الْبُيُوتِ لَبَيْتُ الْعَنكَبُوتِ لَوْ كَانُوا يَعْلَمُونَ _ (العنكبوت:٤١)

"అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నవారు సాలె పురుగును పోలివున్నారు. అది తన కొరకు ఒక ఇల్లు కట్టుకుంటుంది. అన్ని ఇళ్ళ కంటే అతి బలహీనమైన ఇల్లు సాలె పురుగు ఇల్లే. అయ్యో వారికి ఈ విషయం తెలిస్తే ఎంత బాగుంటుంది! " (ఖుర్ఆన్ - 29:41)



IPC
ISLAH PRESENTATION COMMITTEE
Ext. 110 2444117
www.thelastingmiracle.com



www.ipc-kw.com 301 داخلي 2444117 - 2427383

شارع فهد السالم مسجد الملا صالح ص.ب 23913 الصفاة 13100 الكويت ، البريد الالكتروني ipc@ipc-kw.com